నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక

RNI - TELTEL/2023/87644


## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

ఆంగ్లమాధ్యమములు నంచెలంచెలుగను,
తరిగి పోయెజూడ తల్లి భాష
తెలుగు దేశమందు వెలుగులీనెడు యట్టి
తెలుగు పద్యమునకు తెగులు బుట్టె

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 46 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 25-06-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00




## బీఆర్ఎస్ నేతల మాటలు
# నమ్మితే అధోగతే

- ఆ నలుగురూ దేశం మీద పడి దుష్ప్రచారాలు
- ఇచ్చిన హామీలు అమలు చేస్తూ పోతున్నాం
- ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమం
- మీడియా సమావేశంలో మంత్రులు భట్టి, తుమ్మల

ఖమ్మం జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. ఆనాడు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరమ్మ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరలేదని గుర్తుచేశారు. బుధవారం వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతు ఆశీర్వాద సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పది సంవత్సరాలలోనే కుంగిపోయిందని భట్టి విమర్శించారు.

-మిగతా 2 లో

## ఎమ్మెల్యేలకు
# సీఎం డెడ్‌లైన్

### 'వారంలోగా పనితీరు మారాలి

- లేదంటే మీ స్థానంలో మరొకరిని నియమిస్తాం
- పార్టీ కోసం పనిచేయకపోతే మాకు అవసరం లేదు
- ఎంత పెద్దవారైనా వదలం
- ఇన్‌చార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలి'
- సర్‌తో బిజెపి రాజకీయ కుట్రలకు తెరతీస్తోంది
- బాధ్యత లేని నాయకులను తప్పించడానికి వెనకాడం
- జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్ ఘాటు హెచ్చరిక



ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జూమ్ ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పనితీరు మార్చుకునేందుకు 10 రోజుల గడువు విధిస్తున్నానని, తీరు మారని పక్షంలో వారి స్థానంలో యాక్టివ్‌గా ఉన్న నాయకులకు బాధ్యతలు అప్పగిస్తామని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మంత్రులైనా సరే బాధ్యతగా పనిచేయకపోతే ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి తప్పిస్తామని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్ తరహాలో లౌకికవాద ఓట్లను తొలగించేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని, బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా ఉండి ప్రతి ఓటును కాపాడుకోవాలని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

2



## చంద్రబాబు జేబు సంస్థగా
# పోలీస్ వ్యవస్థ

- సాయికృష్ణ కేసులో సాక్ష్యాలను మాయం చేశారు
- పోలీసుల తీరుకు నిరసనగా వచ్చేనెల 29న పాదయాత్ర
- మీడియా సమావేశంలో అంబటి రాంబాబు

గుంటూరు,జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఏపీలో పోలీసు వ్యవస్థ చంద్రబాబు జేబు సంస్థగా మారిందని మాజీ మంత్రి అంబటి రాంబాబు సంచలన ఆరోపణలు చేశారు. సాయికృష్ణ కేసులో సాక్ష్యాలను మాయం చేశారు. ఏ తప్పు చేయకపోయినా తనను అరెస్ట్ చేశారంటూ మండిపడ్డారు. 18 రోజుల పాటు రాజమండ్రి జైల్లో ఉంచారు. వచ్చే నెల 29న వినతి పాదయాత్ర చేస్తా అని అంబటి ప్రకటించారు. అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ..'కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఒత్తిడితోనే నాపై కేసులు నమోదు చేశారు. నా ఇంటిపై దాడి చేయడమే కాకుండా నాపై అక్రమంగా రెండు కేసులు పెట్టారు.


-మిగతా 2 లో

# ఎస్ఐఆర్‌లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా..?



- బెంగాల్ ప్రభుత్వ నిర్ణయంపై సుప్రీంకోర్టు ఆశ్చర్యం
- నేరుగా సుప్రీంకు వద్దు.. ముందుగా హైకోర్టుకే వెళ్లండి
- ఆర్టికల్ 32 కింద దాఖలైన పిటిషన్ ఉపసంహరణ
- కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛ

2



## ఖమేనీ అంత్యక్రియలకు ప్రధాని మోదీకి ఆహ్వానం

- వచ్చే నెల 5 నుంచి 9 వరకు ఇరాన్‌లో అధికారిక కార్యక్రమాలు
- టెహ్రాన్, ఖోమ్ నగరాల్లో అంతిమ సంస్కారాలు.. మషాద్‌లో ఖననం
- హాజరుపై ఇంకా నిర్ణయం తీసుకోని భారత ప్రభుత్వం
- చాబహార్, ప్రాంతీయ భద్రతపై భారత్-ఇరాన్ కీలక చర్చలు

న్యూఢిల్లీ, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ దివంగత ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరు కావాల్సిందిగా ప్రధాని మోదీకి ఆహ్వానం అందింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. వచ్చే నెలలో ఖమేనీ అంత్యక్రియలు ఘనంగా జరగబోతున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా ప్రధాని మోదీని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్

-మిగతా 2 లో



# రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు

- కెసిఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆగమైన రాష్ట్రం
- జిల్లా ప్రాజెక్టులపై మంత్రుల నిర్లక్ష్యం
- సత్తుపల్లి పర్యటనలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్


ఖమ్మం, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యువల్ సీఎం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సెటైర్లు వేశారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రం ఆగమవుతుందని కేసీఆర్ అనాడే చెప్పారని అన్నారు.

-మిగతా 2 లో

## తుంగభద్ర జలాల్లో తెలంగాణకు
# అన్యాయం

### కర్నాటక అక్రమ ప్రాజెక్టులతో పాలమూరు ఎడారి

- ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలు కాపాడాలి
- నీటి వాటాల కోసమే తెలంగాణ పోరాడి గెలిచింది
- కర్నాటక దురాగతాలను అడ్డుకోకుంటే మళ్లీ పోరాటం తప్పదు
- సిఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ



హైదరాబాద్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
తుంగభద్ర జలాల్లో తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టే కుట్రలను తక్షణమే విరమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి టి. హరీశ్ రావు స్పష్టం చేశారు. తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని సీఎంకు ఆయన సూచించారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను హరీశ్ రావు విడుదల చేశారు. 'సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన

-మిగతా 2 లో

# ఫ్రాన్స్, బ్రిటన్‌లో.. ఉక్కిరిబిక్కిరి



- ఎండ వేడిమితో ఈతకు వెళ్లి 40 మంది మృతి
- నిప్పుల కొలిమిలా యూరప్
- సగం ఫ్రాన్స్‌కు రెడ్ అలర్ట్
- నిద్ర లేచేసరికే ఒళ్లంతా చెమటలు
- గాల్లో నిప్పులు కురుస్తున్నట్లు అనుభూతి

2

# రాజకీయాల్లోకి వస్తే టార్గెట్ చేస్తారా?




- సమాజంలో కులాల కంటే.. మగ, ఆడ అనే రెండు కులాలే ఉన్నాయి!
- పోలీసు శాఖలో 33 శాతం రిజర్వేషన్లు.. ఇంకా పూర్తిస్థాయిలో అమలేదీ?
- ఐటీ, బ్యాంకింగ్ రంగాల్లో రాణిస్తున్నా.. పెళ్లి, కుటుంబ బాధ్యతలతో మళ్లీ మొదటికే!
- 2026లోనూ బాల్య వివాహాలా?..
- టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆవేదన

హైదరాబాద్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
రాజకీయాల్లో ఏది మాట్లాడినా తన మీద సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్ చేస్తున్నారని టీఆర్ఎస్ చీఫ్ కవిత అన్నారు. ఆడవాళ్లు రాజకీయాల్లోకి వస్తే ఇలానే టార్గెట్ చేస్తారనే భావనతోనే కొందరు కావాలనే ఈ ట్రోలింగ్స్‌కు పాల్పడుతున్నారని చెప్పారు. ఇప్పటికీ ప్రపంచంలో లింగ వివక్ష కొనసాగుతోంది. అనేక రంగాల్లో మగవారికే ప్రాధాన్యత లభిస్తోంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో కులాల కంటే.. మగవారి కులం, ఆడవారి

-మిగతా 2 లో

# ఏపీలో సువర్ణ అధ్యాయం మొదలైంది



- రాయలసీమ రతనాలసీమగా మారబోతోంది
- జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ఇక్కడి ప్రజల జీవితాలు మారుతాయి
- భవిష్యత్‌లో దేశమంతా జొన్నగిరి గురించే మాట్లాడుతుంది
- శరవేగంగా సీమ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం
- గొడ్డలి పార్టీ కుల రాజకీయాలతో అప్రమత్తంగా ఉండాలి
- జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రారంభంలో సిఎం చంద్రబాబు

కర్నూలు,జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఏపీలో సువర్ణ అధ్యాయం మొదలైందని.. రాయలసీమ రతనాలసీమగా మారబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం జొన్నగిరిలో గోల్డ్ మైన్స్ ప్లాంట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ఇక్కడి ప్రజల జీవితాలు మారుతాయన్నారు. గతంలో జొన్నగిరిని స్వర్ణగిరిగా పిలిచేవారని.. మన దగ్గర కూడా బంగారం ఉత్పత్తి కాబోతోందని తెలిపారు. భవిష్యత్‌లో దేశమంతా జొన్నగిరి గురించే మాట్లాడుతుందని వెల్లడించారు. ఒకప్పుడు కెజిఎఫ్... ఇప్పుడు జెజిఎఫ్ అని ముఖ్యమంత్రి అన్నారు.

-మిగతా 2 లో

## బీఆర్ఎస్ నేతల మాటలు నమ్మితే అధోగతే

మొదటి తరువాయి

కేసీఆర్ చేసిన అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీతో చెల్లిస్తోందన్నారు. తండ్రి, కొడుకు, అల్లుడు, కూతురు మాయమాటలతో రాష్ట్రంలో తిరుగుతున్నారని.. ప్రజలు నమ్మవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర సంవత్సరాల కాలంలో ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుతూ వచ్చామని తెలిపారు. కోటి పది లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా ఇస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు 22 వేలకోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని చెప్పారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా కింద వేలకోట్ల రూపాయలు చెల్లించామని తెలిపారు. మహిళల ఉచిత బస్సుకు 13వేల కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన 'సర్' ప్రమాదకరమైందని అన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. పోలింగ్ సిబ్బందికి సమగ్రమైన సమాచారం అందించాలన్నారు. జూన్ 30వ తేదీన మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రెండున్నర సంవత్సరాల కాలంలో రైతు భరోసాకు 36 వేల కోట్ల రూపాయలు అందించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిది అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అవసరమైన ఎరువులను అందించామని చెప్పారు. ఈ నెల 30వ తేదీన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలన్నారు. రైతులను ఆదుకోవడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్, రాష్ట్ర కళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నూత సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

## చంద్రబాబు జేబు సంస్థగా పోలీస్ వ్యవస్థ

మొదటి తరువాయి

నన్ను జైలులో ఉంచారు. రెండు కేసుల్లో ఏడేళ్ళ లోపు శిక్ష పడే సెక్షన్లే పెట్టారు. ఈ కేసులో ఇద్దరు సీఐలు, ఒక ఎస్ఐకి హైకోర్టు.. కోర్టు ధిక్కరణ కింద నోటీసులు ఇచ్చింది. వంశీధర్ అనే సీఐ, మధు అనే ఎస్ఐ ఇల్లీగల్‌గా నన్ను లోపలేశారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లుకి హైకోర్టు నోటీస్ ఇచ్చింది. ఈ ముగ్గురు పోలీసులను కేంద్ర మంత్రి పెమ్మసాని పురిగొల్పి నన్ను అరెస్ట్ చేయించారు. డీజీపీ, ఐజీ, ఎస్పీ, డిఎస్పీలకు చెబుతున్నాను. నా ఇంటిపై దాడి చేసిన వాళ్లపై ఎందుకు చర్యలు తీసుకోలేదు. అందుకే వచ్చే నెల 29వ తేదీన వినతి పాదయాత్ర చేస్తున్నాను. పోలీస్ వ్యవస్థ చంద్రబాబు జేబు సంస్థగా కొనసాగుతుంది. సాయికృష్ణ అంశంపై మేము పోరాడటానికి కారణం వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయనే. కృష్ణలంక పోలీస్ స్టేషన్లో ఏడాది సీసీటీవీ ఫుటేజ్ మాయం చేశారు. ఏడాది నుండి పీఎస్‌లో నేరాలు జరుగుతున్నాయి. ఐజీ రవి ప్రకాష్ ఆధ్వర్యంలోనే సాక్ష్యాధారాలు మాయం చేశారు. సీఐ నాగరాజుతో బేరసారలాడారు. ఏ పోలీస్ పేరు చెప్పవద్దని సీఐ నాగరాజును బతిమలాడారు. ఏ తప్పు చేయకపోయినా నన్ను అరెస్టు చేసి జైలులో వేశారు. కానీ, సీఐ నాగరాజును లాకప్‌లో ఎందుకు వేయలేదు?. పోలీసులు ప్రజలను కాపాడలేరు. సీఎం, హోంమంత్రి విఫలమయ్యారు. పవన్ కల్యాణ్.. నాగరాజును జిందాబాద్ అంటారేంటి ఆయనకు సిగ్గు అనిపించడం లేదా?. పవన్ కల్యాణ్ ఆత్మవిమర్శ చేసుకోవాలి. హోంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## ఎస్ఐఆర్‌లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా..?

- బెంగాల్ ప్రభుత్వ నిర్ణయంపై సుప్రీంకోర్టు ఆశ్చర్యం
- నేరుగా సుప్రీంకు వద్దు.. ముందుగా హైకోర్టుకే వెళ్లండి
- ఆర్టికల్ 32 కింద దాఖలైన పిటిషన్ ఉపసంహరణ
- కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛ

న్యూఢిల్లీ,



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నుంచి పేరు తొలగించబడిన వారికి రేషన్ నిరాకరిస్తూ పశ్చిమబెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఎస్ఐఆర్‌లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా అంటూ సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తంచేసింది. ఇది రాష్ట్ర పరిధిలోని ప్రత్యేక కారణాలతో కూడిన అంశం కాబట్టి.. ఆర్టికల్ 32 కింద నేరుగా సుప్రీంకోర్టుకు రాకుండా ముందుగా కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.దాంతో పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్ ప్రసన్న తన పిటిషన్‌ను ఉపసంహరించుకుని హైకోర్టుకు వెళ్లేందుకు అనుమతి కోరారు. రేషన్ నిరాకరణ వివాదంపై కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తూ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన వెకేషన్ బెంచ్ ఆదేశాలు జారీచేసింది.

## ఖమేనీ అంత్యక్రియలకు ప్రధాని మోదీకి ఆహ్వానం

మొదటి తరువాయి

ఆహ్వానించారు. జులై 5 నుంచి 9వ తేదీ వరకు ఖమేనీ అంత్యక్రియలను ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. మొదట టెహ్రాన్, ఖోమ్ పట్టణాల్లో అంతిమ సంస్కారాలకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అనంతరం ఖమేనీ స్వస్థలమైన మషాద్‌లో ఖననం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి వివిధ దేశాల నాయకులను, ప్రతినిధి బృందాలను ఇరాన్ ఆహ్వానిస్తోంది. కాగా, ఇరాన్ నుంచి వచ్చిన ఆహ్వానంపై భారత ప్రభుత్వం ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. ప్రధాని మోదీ స్వయంగా హాజరవుతారా లేదా భారత తరఫున ప్రత్యేక ప్రతినిధిని పంపుతారా అనే అంశంపై దౌత్య వర్గాల్లో చర్చ జరుగుతోంది. భారత్-ఇరాన్ మధ్య ఇంధనం, వాణిజ్యం, ప్రాంతీయ భద్రత, చాబహార్ నౌకాశ్రయం వంటి కీలక అంశాల్లో సహకారం కొనసాగుతోంది.

## రాజకీయాల్లోకి వస్తే టార్గెట్ చేస్తారా?

మొదటి తరువాయి

కులం అనే రెండు మాత్రమే ఉన్నాయనిపిస్తోందని కవిత వ్యాఖ్యానించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో జరిగిన వేట విమెన్ ఎంపవర్‌మెంట్ సమ్మిట్‌లో మాట్లాడిన కవిత.. సమాజంలో, రాజకీయాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షపై ఆమె ఎమోషనల్ అయ్యారు. తెలంగాణ వచ్చాక పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తెచ్చుకున్నా.. ఇప్పటికీ అది పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. జీన్-జెడ్ జనరేషన్‌లోనూ అమ్మాయిలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, మహిళలు ఎదగాలని చూస్తే వెంటనే తొక్కేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఐటీ, బ్యాంకింగ్, మీడియా రంగాల్లో ఎంత సత్తా చాటుతున్నా.. పెళ్లి, కుటుంబ బాధ్యతల వల్ల మళ్లీ కెరీర్‌ను మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తోందని, అందుకే మహిళలకు ప్రభుత్వాలు, కుటుంబం, సమాజం సపోర్ట్ ఇవ్వాలని కోరారు. బాల్య వివాహాలపై కవిత షాకింగ్ గణాంకాలను బయటపెట్టారు. 2026 లో కూడా తెలంగాణ గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయని.. పె÷-లశైన 15-19 ఏళ్ల మధ్యలోనే అమ్మలవుతున్న టీనేజర్ మదర్స్ గ్రామీణ ప్రాంతాల్లో 7.2 శాతం ఉంటే, హైదరాబాద్ లాంటి మహానగరంలోనే 2.7 శాతం మంది ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థినులకు పిలుపునిస్తూ.. సోషల్ మీడియాలో లైకులు, ఫాలోవర్స్ రాలేదని నిరుత్సాహపడొద్దని, మహిళలంతా ఒక మంచి టా÷-గ్గ÷ట్ పెట్టుకొని, దాన్ని సాధించే దిశగా బలమైన గొంతుకతో ముందుకు సాగాలని కవిత పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్యేలకు సీఎం డెడ్‌లైన్

- వారంలోగా పనితీరు మారాలి
- లేదంటే మీ స్థానంలో మరొకరిని నియమిస్తాం
- పార్టీ కోసం పనిచేయకపోతే మాకు అవసరం లేదు
- ఎంత పెద్దవారైనా వదలం
- ఇన్‌చార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలి'
- సర్‌తో బిజెపి రాజకీయ కుట్రలకు తెరతీస్తోంది
- బాధ్యత లేని నాయకులను తప్పించడానికి వెనకాడం
- జూమ్ మీటింగ్‌లో సిఎం రేవంత్ ఘాటు హెచ్చరిక



హైదరాబాద్,

ఎస్ఐర్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులను క్షమించే ప్రసక్తి లేదని, పనిచేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోం అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. పని చేయని వారికి 10 రోజుల సమయం ఇచ్చి చూస్తాం.. లేకుంటే వారి స్థానంలో మరొకరిని నియమిస్తామని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌పై సర్పంచ్‌లతో గ్రామాల్లో ప్రచారం చేయించాలని సూచించారు. తెలంగాణలో గురువారం నుంచి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ఎస్ఐఆర్ ప్రారంభం కానుండడంతో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ పక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. ఓటర్ల హక్కులను కాపాడటంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, దేశవ్యాప్తంగా భాజపా రాజకీయ వ్యూహాలను గమనించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే సర్ విషయంలో సీరియస్‌గా లేకపోవడం పట్ల పలువురు ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని ఆగ్రహం చెందారు సర్ పేరిట బీజేపీ కుట్ర చేస్తోందని.. అప్రమత్తంగా లేకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గంలోనే ఉంటూ మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. తనకి ఒక నియోజకవర్గం కేటాయిస్తే వెళ్లి పనిచేస్తానని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఎమ్మెల్యేలు తీరు మారితే ఒకే అని.. వారం రోజుల్లో తీరు మారకపోతే ఎమ్మెల్యేల స్థానంలో యాక్టివ్‌గా ఉన్న మరోవ్యక్తిని ఇన్‌ఛార్జిగా నియమిస్తామని సీఎం స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేయని వాళ్లు పార్టీకి అవసరం లేదని తేల్చిచెప్పారు. సర్ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. పార్టీలో ఏ పదవిలో ఉన్నా సర్ విషయంలో గ్రౌండ్ లెవల్‌కు వెళ్లి పనిచేయాల్సిందే అని అన్నారు. 'ఎవరెవరు పని చేయడం లేదో నా దగ్గర రిపోర్ట్ ఉంది. పద్ధతి మార్చుకోకపోతే వచ్చే మీటింగ్‌లో పేర్లు చెప్పాల్సి వస్తుంది. పేర్లు చెప్పించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దని అన్నారు. ఇన్‌ఛార్జి మంత్రులు కూడా బాధ్యత తీసుకోవాలని.. పనిచేయకపోతే ఇన్‌ఛార్జి మంత్రులను కూడా మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల నిర్వహణ విషయంలో జరిగిన పరిణామాలను పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. తమకు అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికవాద ఓట్లను లక్ష్యంగా చేసుకుని కుట్రలు జరిగే ప్రమాదం ఉందని, ప్రతి అర్హత కలిగిన ఓటు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు చర్యలు తీసుకోవాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత కీలకంగా పని చేయాలని సూచించారు. సర్ పక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న ఎమ్మెల్యేలపై ఫైర్ అయ్యారు. ఈ విషయంలో చాలా మంది ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటికైనా తీరు మారాలని సూచించారు. ప్రతి ఓటునూ కాపాడుకోవాలని ఆదేశించారు. లౌకికవాదుల ఓట్ల తొలగింపు కుట్ర జరుగుతోందన్నారు. గద్వాల, మల్కాజిగిరి, భువనగిరి, నిజామాబాద్‌లో వీక్‌గా ఉన్నామని చెప్పారు. మెజారిటీ ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాలకు దూరంగా ఉండడం సబబు కాదని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. ఓటు హక్కు రాజకీయాల కోసం మాత్రమే కాదని మీనాక్షి నటరాజన్ అన్నారు. జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. మనిషికి ఆక్సిజన్ ఎంత అవసరమో ఓటు హక్కు అంతే అవసరమన్నారు. ఓటు అనేది ప్రతి మనిషికి సోషల్ స్టేటస్ అని చెప్పుకొచ్చారు. ఎంతో కష్టపడితే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఓటు హక్కు వచ్చిందని తెలిపారు. ఓటు హక్కును కాపాడవలసిన బాధ్యత అందరిది అని మీనాక్షి నటరాజన్ వెల్లడించారు. జూమ్ మీటింగ్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు

మొదటి తరువాయి

బీఆర్ఎస్ ఓటమితో రాష్ట్రం నష్టపోయిందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి 72సార్లు ఢిల్లీ వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. బుధవారం సత్తుపల్లిలో కేటీఆర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏవర్గాన్ని వదిలిపెట్టకుండా కాంగ్రెస్ సర్కార్ వేధిస్తోందని ధ్వజమెత్తారు. సత్తుపల్లి విలేకర్లకు మండల రిపోర్టర్లుగా అక్రిడిటేషన్ జారీ చేసి రేవంత్‌రెడ్డి సర్కార్ అన్యాయం చేసిందని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు. మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కల్లూరు మున్సిపాల్టీ బీఆర్ఎస్ గెలిచేదని.. సత్తుపల్లిలో కూడా స్వల్ప ఓట్లతో ఈ స్థానం చేజార్చుకున్నామని తెలిపారు. ఆయా ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే పార్టీ శ్రేణులు పొంగిపోకూడదని.. ఓడితే కృంగిపోకూడదని పేర్కొన్నారు. తెలంగాణ మారుమూల ప్రాంతాలు ఎక్కడకు వెళ్లినా దుర్మార్గపు కాంగ్రెస్ పాలన పోవాలని.. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ హయాంలోని మొదటి పదేళ్లు పునాది రాళ్లు వేసుకున్నామని వివరించారు. రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి జరగాలంటే కేసీఆర్ రావాలని ప్రజలే అంటున్నారని తెలిపారు. కేసీఆర్ ఓటములు, గెలుపులు చూశారని.. అనాడు తెలుగుదేశం పార్టీలో అన్నగారితో కలిసి నడిచారని ప్రస్తావించారు. అన్నదాతలకు రైతుబంధు పూర్తిగా చేయకుండా వేధిస్తోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలోనూ రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇదే ఖమ్మం జిల్లాకు, కొత్త గూడెం జిల్లాకు, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరిలోని నీటిని ఒడిసిపట్టి మొత్తం సస్యశ్యామలం కావాలి.. ఖమ్మం జిల్లా రూపు రేఖలను మార్చాలనే ప్రయత్నం కేసీఆర్ బలంగా చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ వాళ్లు జల యజ్ఞంలో భాగంగా రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ అనే రెండు ప్రాజెక్టులకు రాళ్లు వేసి పోయారు. కానీ చేసింది పెద్దగా ఏం లేదు. కానీ కేసీఆర్ ఎవరో సంబంధం లేని నాయకుల పేర్లు ఎందుకని ఆలోచన చేసి మీ జిల్లా మొత్తం తెలంగాణకు ఆరాధ్య దైవమైన భద్రాద్రి సీతారామ స్వామి వారి పేరు మీద సీతారామ ప్రాజెక్టు అని పెట్టి మన జిల్లాకు 7 లక్షల ఎకరాలకు.. కొత్తగా నాలుగురన్నర లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు.. ఎన్ఎస్పీల కింద కాలువల కింద ఉండే వ్యవసాయాన్ని స్థిరీకరించడానికి 2.50 లక్షల ఎకరాలకు మొత్తంగా 7 లక్షల ఎకరాలకు సాగునీరందించే బృహత్తర యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. అందులో మీ సత్తుపల్లిలో 90 వేల ఎకరాల స్థిరీకరణ 40 వేల ఎకరాలు మొత్తం కలిపి లక్షా 30 వేల ఎకరాలు సీతారామ ప్రాజెక్టు పూర్తయితే మొట్టమొదటి ఫలితం అందుకునే నియోజకవర్గం మీ సత్తుపల్లి అని కేటీఆర్ అన్నారు. ఒకటి రెండు కాదు దాదాపు 10వేల కోట్ల రూపాయలతో ప్రారంభమైంది సీతారామ ప్రాజెక్టు. అందులో 8 వేల కోట్ల రూపాయలు కేసీఆర్ ప్రభుత్వమే ఖర్చు పెట్టింది. అంటే 80 శాతం నిధులు మనం ఇప్పటికే ఖర్చు పెట్టాం. మరి ఈ రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లా మొత్తం కాంగ్రెస్‌కే గెలుపు అందించిన తర్వాత వాళ్లు మనకేం ఇచ్చారు.. ఇవాళ ఖమ్మం జిల్లా రైతులు ఆలోచన చేయాలి. జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి, రెవెన్యూ మంత్రి.. ముగ్గురు మంత్రులున్నారు. పవర్‌ఫుల్ పోర్ట్‌పోలియోల్లో ఉన్నారు.. పవర్ అంతా ఖమ్మం జిల్లాలోనే ఉందట. కానీ ఖమ్మం జిల్లా ప్రజలకు ఏం ఒరిగింది. ఖమ్మం జిల్లా రైతులకు ఏం జరిగింది.. దయచేసి మీరు ఆలోచించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

## ఏపీలో సువర్ణ అధ్యాయం మొదలైంది

మొదటి తరువాయి

చమురు తర్వాత దేశంలో ఎక్కువ దిగుమతి అయ్యేది బంగారమే అని తెలిపారు. రాయలసీమలో సిరులు పండించేందుకు శరవేగంగా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని చెప్పారు. ఏడాదికి టన్ను బంగారం ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ప్రస్తుతం 400 కిలోల సామర్థ్యంతో బంగారం ఉత్పత్తి అవుతుందని, భవిష్యత్‌లో 1000 కిలోల బంగారం ఉత్పత్తి చేయనున్నట్లు వెల్లడించారు. రెండో యూనిట్‌తో కలిపి 50 టన్నుల బంగారం ఉత్పత్తి అవుతుందన్నారు. ఇప్పటికే 800 మందికి ఉద్యోగాలు లభించాయని.. త్వరలో మరో 1500 మందికి ఉపాధి లభించనుందన్నారు. భవిష్యత్‌లో 5 వేల మందికి స్వర్ణగిరి గోల్డ్ మైన్స్‌లో ఉపాధి లభిస్తుందని సీఎం పేర్కొన్నారు. గోల్డ్ మైనింగ్‌తో జొన్నగిరిలో పూర్వ వైభవానికి శ్రీకారం చుట్టామని అన్నారు.రాయలసీమను రతనాల సీమగా మార్చడం జొన్నగిరి నుంచే ప్రారంభమవుతుంది. ఈ ప్రాంతాన్ని గతంలో సువర్ణగిరి అని పిలిచేవారు. అశోకుడి నాలుగో రాజధాని ఇది. జొన్నగిరిని సువర్ణగిరిగా మార్చుకుందామా? వందల ఏళ్ల క్రితమే ఈ ప్రాంతం బంగారం, రత్నాలతో నిండింది. అశోకుడి శాసనాలు ఈ ప్రాంత వైభవాన్ని చాటి చెబుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి సీమను కాపాడాలనే ఆలోచన చేసిన వ్యక్తి ఎన్టీఆర్. ఆయన నిర్ణయంతో రాయలసీమ ప్రాంతానికి ప్రాణం పోశాం అని అన్నారు. ఇప్పటికి 400 కిలోల సామర్థ్యంతో ప్రారంభమైంది. భవిష్యత్తులో వెయ్యి కిలోలకు చేరుతుంది. ఇప్పటికే 800 ఉద్యోగాలు వచ్చాయి. త్వరలో 1500 మందికి ఉపాధి కల్పిస్తాం. భవిష్యత్తులో 5వేల మందికి ఈ గోల్డ్ మైన్స్‌లో ఉపాధి దొరుకుతుంది. జొన్నగిరి రాష్ట్రానికి ఆదర్శంగా తయారవుతుంది. ఈ ప్రాంతానికి గ్రోత్ ఇంజిన్‌గా మారుతుంది. ఇక్కడ నగల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నా. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఆంధ్రప్రదేశ్ చిరునామాగా మారింది. రాయలసీమకు ఇన్ని పరిశ్రమలు వస్తాయని అనుకున్నారా?దేశంలోనే అతిపెద్ద డ్రోన్ సిటీ కర్నూలులో వస్తోంది. వీలైనంత త్వరగా కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తాం. 2028 నాటికి రాయలసీమలో స్టీల్ ప్లాంట్ ప్రారంభిస్తాం అన్నారు. 2019-24 మధ్య రాష్ట్రంలో విధ్వంస పాలన నడిచింది. వేంకటేశ్వరస్వామికి అపచారం జరిగితే శిక్షించాలా..లేదా? స్వామివారి ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపారు. ఇప్పుడు దేవుడి దగ్గరకు వెళ్లి దండాలు పెడుతున్నారు. దేవుడిని నమ్మే ఏ వ్యక్తి కూడా వాళ్లను క్షమించడు. ప్రజలకు ఏవిధంగా మంచి చేయాలనేదే నా ఆలోచన. గొడ్డలి పార్టీ విషాన్ని చిమ్ముతోంది. నేరాలు చేయడంలో ఆ పార్టీ నేతలు సమర్థులు. సాయికృష్ణ ఘటనకు కూడా కులం రంగు పులిమారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై నోరుపారేసుకుంటున్నారు. అలాంటి వారి నోరు మూయించే శక్తి మాకుంది. మెగా డీఎస్సీ పూర్తయిన ఏడాది తర్వాత పేపర్ లీకైందని ఆరోపణలు చేస్తున్నారు. దీనిపై చర్చకు రమ్మని మంత్రి లోకేశ్ సవాల్ విసిరితే రాలేదు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా దాదాపు 11వేల మంది ఉద్యోగులను సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు తీసుకొచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపాం' అని చంద్రబాబు అన్నారు.

## ఫ్రాన్స్, బ్రిటన్‌లో.. ఉక్కిరిబిక్కిరి

లండన్,

ఫ్రాన్స్, బ్రిటన్ దేశాల్లో ఎండలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కదలకుంటూ కూర్చున్నా ప్రాణాలు పోయేలా ఎండలు మండిపోతున్నాయి. వేడి తట్టుకోలేక ఉపశమనం కోసం ఈతకు వెళ్లిన వారిలో ఐదు రోజుల్లోనే ఏకంగా 40 మంది నీట మునిగి మృతి చెందడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఖండంలో మెజారిటీ జనాభా ప్రస్తుతం మునుపెన్నడూ చూడని అత్యంత అసాధారణ ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

**ఫ్రాన్స్‌లో రెడ్ అలర్ట్**

ఫ్రాన్స్ జాతీయ వాతావరణ సంస్థ 'మెటియో ఫ్రాన్స్' దేశంలోని దాదాపు సగానికి పైగా ప్రాంతాలను అత్యంత ప్రమాదకరమైన 'రెడ్ హీట్ వేవ్ అలర్ట్' పరిధిలోకి తెచ్చింది. పగలు, రాత్రి తేడా లేకుండా ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి.

**మృతుల్లో యువకులే అధికం**

ఫ్రాన్స్ ప్రధాని సెబాస్టియన్ లెకోర్ను సంక్షోభ సమీక్షా సమావేశం అనంతరం మాట్లాడుతూ.. గత ఐదు రోజులలో నీట మునిగి చనిపోయిన 40 మందిలో అత్యధికులు యువకులేనని తెలిపారు. ఫ్రాన్స్‌లో ఇళ్లు, ప్రజా రవాణా వ్యవస్థలకు ఎయిర్ కండిషనింగ్ సదుపాయం పెద్దగా లేకపోవడంతో స్కూళ్లు, రైళ్ల రాకపోకలు, క్రీడా ఈవెంట్లపై ఈ ఎండల ప్రభావం పడింది. మానవ తప్పిదాల వల్లే వాతావరణంలో ఈ మార్పులు వస్తున్నాయి. రాబోయే ఐదేళ్లలో వాతావరణ రికార్డులు మరిన్ని బద్దలవుతాయని ఐక్యరాజ్యసమితి వాతావరణ విభాగం హెచ్చరించింది.

## తుంగభద్ర జలాల్లో తెలంగాణకు అన్యాయం

మొదటి తరువాయి



అతిపెద్ద అన్యాయాల్లో నీళ్ల దోపిడీ ఒకటన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను దశాబ్దాల పాటు దోచుకోవడంతో లక్షల ఎకరాలు బీడు భూములుగా మారాయి. ఆ అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి, కృష్ణా జలాలను తెలంగాణ భూములకు మళ్లించి కరవును పారద్రోలి, పాలమూరు వంటి వలసల జిల్లాలను పచ్చని పంటలతో కళకళలాడేలా చేసిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ జల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి, రాష్ట్ర ప్రయోజనా లను పక్క రాష్ట్రాల వద్ద తాకట్టు పెట్టే ప్రమాదకరమైన విధానాలను అవలంబిస్తోంది. నదుల అనుసంధానం పేరుతో గోదావరి జలాలను తమ రాష్ట్రానికి మళ్లించే ప్రయత్నం చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి సహకారం అందిస్తున్న మీరు, ఇప్పుడు తుంగభద్రపై కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల విషయంలో కూడా అదే ద్రోహ బుద్ధితో వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే మీరు, అదే ప్రాంతంలోని రైతాంగం భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న కురిడి , చిక్కాలపర్వి, చిక్కాలమంచి బ్రిడ్జ్-కమ్-బరాజ్‌లకు మీ ప్రభుత్వం సమ్మతి తెలిపిందా? 2025 జులై 18న కొడంగల్ లిఫ్ట్‌కు కర్ణాటక ఎన్‌వోసీ ఇవ్వడం వెనుక జరిగిన మతలబు ఏమిటి? ఏడాది కాలంగా కర్ణాటక అక్రమ నిర్మాణాలపై అభ్యంతరం చెప్పలేదంటే పరోక్షంగా వాటికి మీరు అనుమతించినట్లేనా? తెలంగాణ నీటిని కర్ణాటకకు తాకట్టు పెట్టే అధికారం మీకు ఎవరు ఇచ్చారని నిలదీసారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఎగువన కర్ణాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే ఆర్డీఎస్‌కు రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయన్న విషయం మీకు తెలియదా? రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతల పథకాన్ని రూ.85 కోట్లతో కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్నంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? ఇప్పటికే ఈ ప్రాజెక్టు ఇన్టేక్ నిర్మాణాలు 60 శాతం వరకు పూర్తి అయితే మీరు, మీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదా? ఈ అక్రమ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కనీసం ఒక్క లేఖ కూడా ఎందుకు రాయలేదని నిలదీసారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అనుమతులు లేకుండానే కర్ణాటక తుంగభద్రపై ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుంటే మీరు, మీ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదన్నారు. కర్ణాటక తనకు కేటాయించిన పరిమితులను దాటి అదనపు సాగు చేస్తోంది. ఆర్డీఎస్‌లో కర్ణాటక వాటా1.2 టిఎంసి మాత్రమే. కాని సగటున 5 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం రాజోలిబండ ఆనకట్టకు 100 మీటర్ల ఎగువన అక్రమంగా కర్ణాటక నిర్మిస్తున్న కురిడి లిఫ్ట్, చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే తెలంగాణ వాటా మరింత తగ్గిపోతుంది.

# కాంగ్రెస్ కౌన్సిలర్ల తీర్మానం తిరస్కరణ

**ఖానాపూర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పట్టణంలో రోడ్ల దుస్థితిపై ఇటీవల ప్రజలు, యువకులు, నాయకులు ఆందోళన చేసిన నేపథ్యంలో బుధవారం జరిగిన మున్సిపల్ సమావేశంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు రోడ్డు అభివృద్ధికి 20 లక్షలు కేటాయించాలని ప్రతిపాదించారు. అయితే చైర్మన్, వైస్ చైర్మన్ ఈ తీర్మానాన్ని తిరస్కరించారు.కాంగ్రెస్ కౌన్సిలర్లు రాజుర సత్యం, నిమ్మల రమేష్, గొర్రె తిరుమల, సాజియా బేగం జమాల్ మాట్లాడుతూ, ఖానాపూర్ పరిరక్షణ సమితి గ్రూపులో జరిగిన చర్చలో మున్సిపాలిటీలో తీర్మానం చేయిస్తామని మాటిచ్చామని, తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. శాసనసభ్యుడు వెడుమ బొజ్జు పటేల్ ద్వారా పనులు చేయిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## మక్కల డబ్బులు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని యువజన సంఘం డిమాండ్



**గన్నేరువరం, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మక్కల డబ్బులు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంపతి ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు.మక్కలు కొనుగోలు చేసి మూడు నెలలు గడిచినా రైతులకు ఇంకా 40 శాతం డబ్బులు అందలేదని, దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. విత్తనాలు, మందులు, బస్తాలు కొనుగోలు చేయడానికి రైతులకు డబ్బులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, స్కూల్లు ప్రారంభమైన నేపథ్యంలో కుటుంబ అవసరాలు తీర్చుకోవడంలో కూడా సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.రెండు రోజుల్లోగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయకపోతే మార్క్‌ఫెడ్ ముందు రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని సంపతి ఉదయ్ హెచ్చరించారు.

# సుడా నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం



**కరీంనగర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కలెక్టరేట్ వెనుక ఉన్న పాత హెలిప్యాడ్ పార్క్‌లో కొత్త హెలిప్యాడ్ నిర్మాణం, కలెక్టరేట్ ఉత్తర వైపు సీసీ రోడ్డు, గార్డెన్ల నిర్మాణ పనులకు సుడా నిధులతో 2 కోట్ల రూపాయల వ్యయంతో టెండర్లు పిలిచి శంకుస్థాపన చేశారు.సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ కొలగాని శ్రీనివాస్, కలెక్టర్ చిత్రా మిశ్రా, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్, అభివృద్ధి పనులకు శ్రీకారం





**కరీంనగర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నగరంలోని 13వ డివిజన్ మార్కండేయనగర్‌లో మలయప్ప ఫౌండేషన్ సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, యువతలో ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించేందుకు ఓపెన్ జిమ్‌లు ఉపయోగపడతాయని ఆయన అన్నారు.తరువాత 1వ డివిజన్ బృందావన్ కాలనీలో రూ.29.70 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైన్ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. ప్రతి డివిజన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు, అధికారులు, నాయకులు, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్



**కల్వకుర్తి, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరా నగర్‌కు చెందిన రాంచంద్రయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు.విషయం తెలుసుకున్న కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో కౌన్సిలర్లు మబ్బు రామరాజు, చిత్తారి శ్రీనివాసులు, చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ సమక్షంలో సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమం



**కరీంనగర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పర్యావరణ పరిరక్షణలో భాగంగా తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమం నిర్వహించారు. పూజ్య గురువు సురేష్ ఆత్మారామ్ మహరాజ్ మార్గదర్శకత్వంలో సభ్యులు పాల్గొని సీడ్ బాల్స్ తయారు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు, కొండప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో సీడ్ బాల్స్ విసరడం ద్వారా మొక్కలు మొలిచి పచ్చదనం పెరుగుతుందని, ప్రకృతి సమతుల్యత కాపాడటానికి ఇవి ఎంతో అవసరమని తెలిపారు. సంస్థ వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పూట్కూరి అడవుల నాశనం వల్ల పర్యావరణ సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఇజ్జగిరి శ్రీనివాస్, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజియన్-9 అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం పది మొక్కలు నాటే సంకల్పంతో పాటు సీడ్ బాల్స్ తయారు చేసి విసరాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సభ్యులు పెద్ది శ్రీనివాస్, చొక్కారపు శ్రీనివాస్, శ్రీనివాస్ రావు, సతీష్ రావు పాల్గొన్నారు.

## గాంధీభవన్‌లో ప్రారంభంకానున్న ఆదివాసీ బస్సు యాత్ర




**కరీంనగర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇందిరమ్మ రిజర్వేషన్లు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జూన్ 25న గాంధీభవన్‌లో ఆదివాసీ బస్సు యాత్ర ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, ఆదివాసీ విభాగం చైర్మన్ విక్రాంత్ సింగ్ భూరియా హాజరవుతారని జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు శ్రావణ్ నాయక్ తెలిపారు.1976లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ లంబాడీలు, ఎరుకలు, యానాదీలకు రిజర్వేషన్లు కల్పించారని, వాటి వల్లే నేడు అనేక మంది ఆదివాసీ ప్రతినిధులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని ఆయన గుర్తు చేశారు. ఈ బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆదివాసీ ప్రజలకు శ్రావణ్ నాయక్ విజ్ఞప్తి చేశారు.

## అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**కరీంనగర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల ఆవరణలో, అలాగే నగరంలోని 14వ డివిజన్ పద్మనగర్ మానేరు కాలనీలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇరిగెల వారి వివాహానికి మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి



**నందికొట్కూరు, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నంద్యాల ఎల్‌కెఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఆళ్ళగడ్డ ఇరిగెల రామచంద్రారెడ్డి--సుభద్రల కుమార్తె ప్రియాంక వివాహం, కర్నూలు వాస్తవ్యులు గంగారపు వెంకటసుబ్బారెడ్డి--సునీతల కుమారుడు రాజీవ్ రెడ్డితో ఘనంగా జరిగింది.ఈ వివాహానికి టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, వధూవరులను ఆశీర్వదించారు.

## ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ కలెక్టర్ కార్యాలయం వద్ద బీజేపీ రైతు ధర్నా




**పెద్దపల్లి, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతు సమస్యలను విస్మరించి వారిని ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నిలబెట్టుకోలేదని, ఎన్నికల ముందు ప్రతి పంటకు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు కేవలం 7 రకాల సన్నలకు మాత్రమే పరిమితం చేసిందని విమర్శించారు. పెద్దపల్లి జిల్లాలో సాగు చేస్తున్న 1224 రకం సన్నలకు కూడా బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా నిధులను ఎకరానికి ?15,000గా పెంచాలని, రైతు భీమా ప్రీమియం చెల్లింపులు నిలిపివేయడం వల్ల మరణించిన రైతుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని, రైతు భరోసా నిధులు ఐదు సార్లు ఇవ్వాల్సి ఉండగా మూడు సార్లకే పరిమితం చేశారని మండిపడ్డారు. రైతు సంక్షేమాన్ని విస్మరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసి మోర్చా ఉపాధ్యక్షులు కందుల సంధ్యరాణి, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ సమావేశంలో అభివృద్ధిపై తీర్మానాలు



**ఖానాపూర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఖానాపూర్ పురపాలక సంఘం కార్యాలయంలో జరిగిన సాధారణ సర్వసభ సమావేశంలో పట్టణ అభివృద్ధికి పలు కార్యక్రమాలను తీర్మానించినట్లు మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ తెలిపారు. పట్టణంలో కోతులను పట్టుకొని నిర్మల్ అడవి శాఖ పునరావాస కేంద్రానికి పంపడం, వర్షాకాలం దృష్ట్యా దోమలు వ్యాప్తి చెందకుండా కాలనీలలో ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయించడం, ఎన్టీఆర్ చౌరస్తా నుండి అంగడి బజార్ వరకు ప్రధాన రహదారిలో గుంతలను తాత్కాలికంగా పూడ్చడం వంటి నిర్ణయాలు తీసుకున్నారు.అలాగే వార్డులలో ఇంకుడు గుంతల నిర్మాణం, పాత మురికికాలువల మరమ్మత్తులు, గోదావరి తీరం వద్ద ప్రజల కోసం శాశ్వత వాటర్ షవర్లు, ప్లాట్‌ఫారమ్ నిర్మాణం, కొత్త విద్యుత్ దీపాలు, స్తంభాల ఏర్పాటు వంటి అంశాలను సమావేశంలో ఆమోదించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముహమ్మద్ షోయబ్ హుస్సేన్, కౌన్సిలర్లు గొర్రె తిరుమల గంగాధర్, తాళ్లపల్లి రాజగంగన్న, సాజియా బేగం జమాల్, గుమ్ముల ఆనంద్ కుమార్, మేష పోసాని, నిమ్మల రామేష్, బొప్పరపు సత్యవతి, బండి పెల్లి సింధుజ ప్రకాష్ గౌడ్, చిన్నం సత్యనారాయణ, తొడసం ఇందిరా, మున్సిపల్ మేనేజర్ సురేందర్, అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్ల మ్యాపింగ్‌పై నిర్లక్ష్యం



**ఖానాపూర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పట్టణ పరిధిలో సుమారు 500 మంది ఓటర్ల మ్యాపింగ్ పని ఇంకా పెండింగ్‌లో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక ప్రజాప్రతినిధులు, మతపెద్దలు, సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం సమర్పించిన వారు, సంబంధిత సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ఫోన్ ద్వారా సంప్రదించినప్పుడు మాకు సంబంధం లేదు, మేము ఆ పని చేయము అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని తెలిపారు. సూపర్వైజర్ కిషన్ కూడా పెండింగ్ పనిపై వివరణ ఇవ్వకుండా తప్పించుకున్నారని వారు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఎంత శాతం మ్యాపింగ్ పూర్తయిందనే వివరాలు వెల్లడించకపోవడం, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోకపోవడం ప్రజల్లో ఆగ్రహం రేపుతోంది. పెండింగ్‌లో ఉన్న ఓటర్ల మ్యాపింగ్ పనిని పూర్తి చేయడానికి ప్రత్యేక ఉద్యోగిని నియమించాలని, నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వారు తహసీల్దార్‌ను కోరారు.ఈ వినతిపత్రంపై జమా మస్జీద్ అధ్యక్షులు జహీర్ అహ్మద్, దారుల్ ఉలూమ్ పెద్దలు షాహిద్ మౌలానా, కాంగ్రెస్ నాయకులు, న్యాయవాది ఎస్.కె. షబ్బీర్ పాషా, కో-ఆర్డినేటర్ ఆఫ్రోజ్, మొహమ్మదియా మస్జీద్ మౌలానా అతీక్ ఉద్దీన్ సూఫీ, అలం ఖాన్, జియా ఉల్ హక్, మొహసీన్, వాసే ఖాన్ మరియు మస్జీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఓటర్ల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహణ



**గంగాధర, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో జూన్ 25 నుండి జూలై 24 వరకు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల గుర్తింపు వివరాలతో కూడిన ఫారాలను పంపిణీ చేసి, ఓటర్ల సంతకాలు తీసుకుంటారు. కొత్తగా అర్హులైన ఓటర్ల కోసం ఫారం--6, మరణించిన వారి పేర్లు తొలగించేందుకు ఫారం--7, మార్పుల కోసం ఫారం--8 స్వీకరించనున్నారు. ప్రతి ఓటర్ ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పట్టాదార్ పాస్‌బుక్ లేదా ఇంటి పన్ను రసీదు జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు సిద్ధంగా ఉంచాలని అధికారులు సూచించారు. గ్రామస్థాయిలో పారదర్శక ఓటర్ జాబితా రూపొందించేందుకు ప్రజలు బీఎల్ఓలకు సహకరించాలని కోరారు.

## విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన సదస్సులు



**కరీంనగర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం (జూన్ 26) సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, క్విజ్, ప్రసంగ పోటీలు నిర్వహించి విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించి క్రీడా సామగ్రి పంపిణీ చేశారు.రూరల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో దుర్శెడ్ జడ్పీ పాఠశాలలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సీపీ గౌస్ అలం మాట్లాడుతూ యువత భవిష్యత్తు తరాలుగా మాదకద్రవ్యాల బారిన పడకుండా రక్షించేందుకు పోలీసు శాఖ నిరంతరం చర్యలు చేపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో ఏసీపీ విజయకుమార్, ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, యాంటీ నార్కోటిక్ యూనిట్ ఇన్స్పెక్టర్ రఫీక్ ఖాన్, కార్పొరేటర్ రవీందర్, ఎస్సై లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలల దోపిడీపై బిఆర్ఎస్వి నివేదిక



**కరీంనగర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు విద్యను సేవా దృక్పథంతో కాకుండా వ్యాపారంగా మార్చి నిరుపేద విద్యార్థులను దోచుకుంటున్నాయని బిఆర్ఎస్వి నేతలు ఆరోపించారు. మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్వి నేతలు డీఈఓను కలసి అక్రమంగా పుస్తకాలను అమ్ముతున్న గోదాముల వివరాలతో కూడిన సమగ్ర నివేదికను అందజేశారు. రెండు రోజుల్లో చర్యలు తీసుకోకపోతే పాఠశాలల గోదాములను ముట్టడిస్తామని హెచ్చరించారు.అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు కనీస వసతులు లేక ప్రజలు ప్రైవేటు పాఠశాలలపై ఆధారపడే పరిస్థితి ఏర్పడిందని, దీన్ని ఆసరాగా చేసుకొని పాఠశాలలు దోపిడీకి పాల్పడుతున్నాయని మండిపడ్డారు. తల్లిదండ్రులు పిల్లలను చదివించాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ద్యావ మధుసూదన్ రెడ్డి, చుక్క శ్రీనివాస్, బొంకూరి మోహన్, గంగాధర చందు, పటేల్ శ్రవణ్ రెడ్డి, సోమిరెడ్డి రాజా నరేష్ రెడ్డి, వడ్లకొండ పరుశరామ్, విక్రమ్, అన్వేష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీపై ఆర్‌పిఐ ఆరోపణలు




**కరీంనగర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
:ప్రైవేటు విద్యాసంస్థలు నోట్‌బుక్స్, టెక్స్ట్‌బుక్స్, డ్రెస్సులు, ఇతర సామగ్రిని బలవంతంగా విక్రయిస్తూ తల్లిదండ్రులపై అధిక భారం మోపుతున్నాయని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ) రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ విమర్శించారు.జిల్లా విద్యాశాఖ అధికారులు అవినీతి కారణంగా ఈ దోపిడీని పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. లక్షల రూపాయలు వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే ప్రత్యేక అధికారిని నియమించి విచారణ జరిపి అక్రమంగా విక్రయిస్తున్న సామగ్రిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రుల నుండి అధిక మొత్తాలు వసూలు చేస్తున్న యజమానులపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపాలని ఆయన హెచ్చరించారు. లేనిపక్షంలో ఆర్‌పిఐ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాలు, ఇతర పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్‌పిఐ జిల్లా అధ్యక్షుడు కాశిపాక అజయ్, సిపియుఎస్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రమేష్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు బెజ్జంకి అంజయ్య, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేధో వికాసంపై సీసం లెడ్ ప్రభావాలపై అవగాహన సదస్సు

**కరీంనగర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పిల్లల ఆరోగ్యం, మేధో వికాసంపై సీసం (లెడ్) ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు జిల్లాలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో అదనపు కలెక్టర్ పోతరాజు హరి ప్రసాద్ ఐఏఎస్, జిల్లా విద్యాధికారి ఎన్. ప్రశాంత్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు లెడ్ ప్రభావాలపై అవగాహన కల్పించారు. లెడ్ శరీరంలో పేరుకుపోతే మెదడు, కాలేయం, మూత్రపిండాలు దెబ్బతింటాయని, కలుషిత గాలి, నీరు, ఆహారం ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తుందని వారు తెలిపారు. అదే విధంగా 'లీడ్ సేఫ్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మల్కాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రంలో లీడ్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. పిల్లలలో లెడ్ శాతం గుర్తించి, న్యూరోకాగ్నిటివ్ అసెస్‌మెంట్ ద్వారా దాని ప్రభావాలను వివరించారు.ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ట్రైన్ కలెక్టర్ వరప్రసాద్, ఏఏపిసి చైర్‌పర్సన్ కవిత, కార్పొరేటర్ జగన్ రెడ్డి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## మొహర్రం ఏర్పాట్లపై సమన్వయ సమావేశం




**కరీంనగర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మొహర్రం పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సమావేశంలో ముస్లిం మత పెద్దలు, అధికారులు పాల్గొన్నారు. ఊరేగింపు మార్గాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య శిబిరాలు, అగ్నిమాపక భద్రత, ట్రాఫిక్ నియంత్రణ వంటి ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు.మత పెద్దలు సూచించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఊరేగింపులకు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. సమావేశంలో అదనపు డీసీపీ వెంకటరమణ, ఆర్డీవోలు షర్మిల, జల కుమారి, ముస్లిం మత పెద్దలు, కమిటీ నాయకులు పాల్గొన్నారు.

## ఉప్పల్ బాగాయత్‌లో జూలై 2న భూ పోరాటం విజయవంతం చెయ్యాలని పిలుపు



**కరీంనగర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆరోపిస్తూ జూలై 2న ఉప్పల్ బాగాయత్‌లో భూ పోరాటం నిర్వహించనున్నట్లు తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు. జిల్లా కార్యాలయంలో ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ బోగే పద్మతో కలిసి పోరాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలాలు, సంక్షేమ బోర్డు, పింఛన్లు ఇవ్వాలని కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదని ఆయన విమర్శించారు. కవిత జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమకారుల కోసం రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి, భూ పోరాటానికి శ్రీకారం చుట్టారని, దీనికి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ సంఘాలు మద్దతు పలుకుతున్నాయని తెలిపారు. జూలై 2న ఉప్పల్ బాగాయత్‌లో జరిగే మహా భూ పోరాటాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అంకం శివరాణి, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల సురేష్, జంగ అపర్ణ, విద్యాసాగర్, లక్ష్మణ్, పోతు కనుకయ్య, బుస్స రవీందర్, సంపత్, కళవతి, రాజేశ్వరి, అనసుర్య, చంద్రశేఖర్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**కరీంనగర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అనేక సంవత్సరాలుగా వెట్టిచాకిరి చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఉప్పునూటి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించిన ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించడం, కార్మికులను పర్మినెంట్ చేయడం, కనీస వేతనం రూ.26,000 ఇవ్వడం, మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయడం, మరణించిన కార్మికులకు రూ.30,000 అంత్యక్రియల ఖర్చు ఇవ్వడం, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే వర్షాకాలంలో నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బుడిగె అంజయ్య, బరిగల మల్లయ్య, సారయ్య, మల్లవ్వ, రాజు, సంపత్, రంజిత్, సరూప్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆందోళన



**కరీంనగర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రభుత్వ సైన్స్ వింగ్ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలకు అవసరమైన 26 తరగతి గదుల్లో కేవలం 12 మాత్రమే ఉండటంతో విద్యార్థులు పాడుబడిన గదుల్లో చదువుకోవాల్సి వస్తోందని, ల్యాబ్ పరికరాలు లేక కొత్త సిలబస్ అమలు చేయడం కష్టమవుతోందని ఆయన తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తరగతి గదులు, ల్యాబ్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.అదే విధంగా శాతవాహన యూనివర్సిటీలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్ కోరారు. రెగ్యులర్ చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు అధిక ఫీజులు భారమై చదువులకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమాల్లో ఎస్ఎఫ్ఐ నాయకులు వినయ్, ఆకాష్, సన్నీ, నరేష్, సాయి, అనిల్, నవీన్, ప్రశాంత్, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల చదువుకు అండగా నిలుస్తాం - మిత్ర ఫౌండేషన్

**కల్వకుర్తి, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి పట్టణంలోని హనుమాన్ నగర్కు చెందిన నిరుపేద కుటుంబంలోని ముగ్గురు విద్యార్థినులు శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిన మిత్ర ఫౌండేషన్ సభ్యులు, ఆ విద్యార్థులకు అండగా నిలుస్తూ పదవ తరగతి పూర్తి చేసే వరకు వారి విద్యా బాధ్యతను స్వీకరించారు. బుధవారం పాఠశాలలో మిత్ర ఫౌండేషన్ సభ్యులు యాజమాన్యంతో సమావేశమై, విద్యార్థుల ఫీజులను పదవ తరగతి వరకు చెల్లిస్తామని, వారి విద్యా భవిష్యత్తుకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.



## ప్రభుత్వ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ కె.హైమావతి



**సిద్దిపేట, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు.తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడి సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యంతో చదువుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించి ప్రభుత్వం నిర్దేశించిన కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశించారు.అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్, పై అధికారుల అనుమతి లేకుండా సెలవులు తీసుకోవద్దని ఉపాధ్యాయులకు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనంలో లోటుపాట్లు లేకుండా చూడాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కలెక్టర్ హెచ్చరించారు.

## మానసిక వికలాంగుల పాఠశాలలో సందీప్ కుమార్ సుల్తానియా సందర్శన



**తిమ్మాపూర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మానసిక వికలాంగులకు విద్యనందించడం గొప్ప అదృష్టమని రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలో స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ఆయన సందర్శించారు.పాఠశాలలో తరగతి గదులు, హాస్టల్, డైనింగ్ హాల్, వృత్తి విద్యా శిక్షణ కేంద్రాలను పరిశీలించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. విద్యతో పాటు నైపుణ్యాలను అందించి స్వావలంబన దిశగా తీర్చిదిద్దడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. పాఠశాల నిర్వహణ తీరు, పరిశుభ్రత, క్రమశిక్షణ, అందిస్తున్న సౌకర్యాలు ఆకట్టుకున్నాయని తెలిపారు. ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, అధికారులు, ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ - 2026



**సిద్దిపేట, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రారంభమవుతోందని జిల్లా కలెక్టర్ కే. హైమావతి తెలిపారు.జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి గణన ఫారాలను పంపిణీ చేసి సేకరిస్తారు. ప్రతి ఓటరు తమ వివరాలను పరిశీలించి సంబంధిత అధికారికి అందజేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.జిల్లా, నియోజకవర్గ స్థాయిలలో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి అవసరమైన సమాచారం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి, ఆగస్టు 30 వరకు దావాలు, అభ్యంతరాలు స్వీకరిస్తారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ప్రతినిధులను నియమించి ఓటరు జాబితా ఖచ్చితత్వాన్ని మెరుగుపరచడంలో సహకరించాలని ఆమె కోరారు.

## ఏఐలోనూ జాతి వివక్ష

**న్యూఢిల్లీ, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



కృత్రిమ మేధ (ఏఐ) మానవుల కన్నా తెలివైనదన్న మాటను వింటున్నాం. ఎలాన్ మస్క్ ఇప్పటికే ఏఐ ఆ స్థాయికి చేరుకుందని అంటున్నారు. కానీ మానవాళి తెలివితేటలు, మేధస్సుతో పాటు అతని నుంచి అత్యంత నీచమైన కొన్ని పక్షపాతాలను ఏఐ వారసత్వంగా పొంది ఉండవచ్చని ఐక్యరాజ్య సమితి జరిపిన ఒక పరిశోధన హెచ్చరిస్తున్నది.

# పట్టణ శోభకు పల్లెలు - మారుతున్న పల్లెల రూపురేఖలు

ఒకప్పుడు పల్లెటూరు అంటే పూరిగుడిసెలు, పెంకుటిల్లులు, ఎడ్లబండ్లు, పాడి పంటలు, పశువులు, కల్మషం లేని మనుషుల మధ్య కళకళలాడే జీవనం. కానీ యాంత్రిక జీవన విధానం, రియల్ ఎస్టేట్ వ్యాపారం విస్తరించడంతో పల్లెలు పట్టణాలకు పోటీగా రూపురేఖలు మార్చుకుంటున్నాయి.ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతో రియల్ ఎస్టేట్ వెంచర్లు విస్తరించాయి. పూరిగుడిసెలు, పెంకుటిల్లుల స్థానంలో మిద్దెలు, మేడలు, డూప్లెక్స్ ఇళ్లు నిర్మాణం జరుగుతోంది. ఒకప్పుడు సైకిల్ ఉన్నవాడే ఆర్థిక స్తోమత కలిగినవాడని భావించేవారు. ఇప్పుడు పల్లెల్లో ఖరీదైన కార్లు సాధారణమయ్యాయి. ఇంటర్నెట్ ఇంటింటా చేరి పట్టణ సంస్కృతిని పల్లెల్లోకి తీసుకొచ్చింది.అయితే ఈ మార్పుల్లో పల్లెల్లోని ఆనందం, స్వచ్ఛమైన గాలి, కల్తీలేని ఆహారం,



కల్మషం లేని మనుషులు కరువైపోయారు. వాతావరణ పరిస్థితులు మారి భవిష్యత్ తరాలు గుడిసెలు, పెంకుటిల్లుల జీవన విధానాన్ని చరిత్రలో మాత్రమే చదివే పరిస్థితి ఏర్పడుతుందని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పల్లెలు పట్టణ శోభను సంతరించుకున్నా, పల్లె జీవనంలోని సహజత్వం, సౌందర్యం తిరిగి రావాలన్న ఆకాంక్ష మాత్రం మిగిలే ఉంది.

**వ్యాసకర్త**
**ఒడ్నాల సురేష్**
**పాలకుర్తి**



## పథకాల అమలులో కరీంనగర్ జిల్లాను అగ్రభాగాన నిలపాలి

- సందీప్ కుమార్ సుల్తానియా




**కరీంనగర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజల సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించి, అర్హులైన వారందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ సందీప్ కుమార్ సుల్తానియా సూచించారు.కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయడం అధికారుల అదృష్టమని, సమస్యల పరిష్కారం నిరంతర ప్రక్రియగా కొనసాగాలని అన్నారు. కరీంనగర్ జిల్లాను ప్రభుత్వ పథకాల అమలులో అగ్రభాగాన నిలపాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పరిశుభ్రత, ఫైళ్ల పరిష్కారం, రైతు భరోసా, రైతు బీమా, ధాన్యం కొనుగోలు, రేషన్ కార్డులు, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, ఉద్యోగ మేళాలు, బడిబాట వంటి పథకాల అమలులో జిల్లాలో సాధించిన విజయాలను వివరించారు. మహిళల సాధికారతకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, అద్దె బస్సుల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని సుల్తానియా తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జడ్పీహెచ్ఎస్‌లో యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు




**గంగాధర, జూలై 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాదక ద్రవ్యాల నిర్మూలన, యువతలో అవగాహన పెంపొందించేందుకు గంగాధర ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో మల్లాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలు, ఆరోగ్యకరమైన జీవన విధానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోస్టర్ తయారీ, నినాదాల రచన, కవితా పోటీలు, రంగోలి, చర్చా కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లో సృజనాత్మకత, సామాజిక బాధ్యతను పెంపొందించారు.ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ యువత విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల వైపు మళ్లాలని సూచించారు. డ్రగ్స్‌పై సమాచారం కోసం 1908 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

-సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగ్గిడి ఐలయ్య



**హుస్నాబాద్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను హుస్నాబాద్ సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగ్గిడి ఐలయ్య పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఎస్సీ సప్లిమెంట్ నిధుల ద్వారా రూ.15 లక్షలతో, ఈజీఎస్ నిధుల ద్వారా రూ.5 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతోందని పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను గ్రామానికి తీసుకురావడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు ఈశ్వర్, ఉపసర్పంచ్ నరేష్, కాంగ్రెస్ నాయకులు వల్లపు పరశురాములు, దేవరాజు, కోమల, శ్రీధర్, పోశయ్య, రవీందర్, ఆదిరెడ్డి, పద్మ, సుజాతతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌లో సీపీ ఆకస్మిక తనిఖీ

**కరీంనగర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.స్టేషన్ రికార్డులు, సీసీటీఎన్ఎస్ 2.0 నమోదు విధానాన్ని పరిశీలించి, కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలను సెక్టార్లుగా విభజించి ప్రతి గ్రామానికి గ్రామ పోలీస్ అధికారులను కేటాయించాలని సూచించారు.రౌడీ షీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని, ప్రతి నెల వారి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. తీగలగుట్టపల్లి రౌడీషీటర్ ఇంటిని స్వయంగా తనిఖీ చేసి, సత్ప్రవర్తనతో మెలగాలని హెచ్చరించారు.సిబ్బంది విధుల్లో నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని, మహిళా సిబ్బందికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని సూచించారు. స్నేహిత కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.ఈ తనిఖీలో రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, ఎస్సై లక్ష్మారెడ్డి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెండ్లి పత్రికపై పుట్టినతేదీ మస్ట్!

-మహారాష్ట్ర ప్రభుత్వం యోచన

**ముంబై జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




బాల్యవివాహాలను నిరోధించేందుకు పెండ్లి పత్రికలపై వధూవరుల పుట్టిన తేదీలను తప్పనిసరిగా ముద్రించేలా నియమం తీసుకురావాలని మహారాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది. బుధవారం శాసనసభలో బీజేపీ సభ్యుడు అతుల్ భత్కల్కర్ అడిగిన ప్రశ్నకు మహిళా, శిశు అభివృద్ధి మంత్రి అదితి తట్కరే సమాధానమిస్తూ పెండ్లి పత్రికలపై వధూవరుల పుట్టిన తేదీలను ప్రచురించే విధానం ఇప్పటికే రాజస్థాన్‌లో అమల్లో ఉందని, ఆ విధానాన్ని అధ్యయనం చేసేందుకు ఆ ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై అప్రమత్తంగా ఉండాలి



**మానకొండూర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరగాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. బీఎల్ఏలు ఇంటింటి సర్వే సమయంలో బూత్ లెవల్ అధికారులతో కలిసి నిశితంగా పరిశీలించి ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని సూచించారు. ప్రతి పది పోలింగ్ కేంద్రాలకు ఒక ఇంచార్జీని నియమించి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని, గ్రామాల్లో డప్పు చాటింపు ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన కోరారు.

# వాస్కులర్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**- డాక్టర్ ప్రభాకర్**



**పెద్దపల్లి, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కాళ్ల నొప్పులను నిర్లక్ష్యం చేయడం ప్రాణాపాయానికి దారితీయవచ్చని, రక్తప్రసరణ తగ్గే వాస్కులర్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని యశోద హాస్పిటల్ సీనియర్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ ప్రభాకర్ హెచ్చరించారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తీవ్రమైన కాళ్ల నొప్పి, నడిచినప్పుడు బిగుతు, చర్మం రంగు మారడం, వాపులు, వేళ్లు నల్లబడటం వంటి లక్షణాలు రక్తనాళాల సమస్యకు సంకేతమని తెలిపారు. ముఖ్యంగా 50 ఏళ్లు దాటిన వారు, ధూమపానం, మద్యం అలవాటు ఉన్నవారు, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ సమస్యలు ఉన్నవారు, ఎక్కువసేపు కదలకుండా పనిచేసేవారు వాస్కులర్ వ్యాధుల బారిన పడే అవకాశం ఎక్కువని వివరించారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే మందుల ద్వారానే 80--90 శాతం వరకు నయం చేయవచ్చని, సకాలంలో చికిత్స పొందితే కాలును తొలగించాల్సిన పరిస్థితి నివారించవచ్చని చెప్పారు. అకస్మాత్తుగా తీవ్రమైన నొప్పి వచ్చినప్పుడు 24 గంటల్లో స్పందిస్తే రక్తనాళాల్లో గడ్డలను కరిగించి కాలును కాపాడుకోవచ్చని సూచించారు. ప్రజలు సమస్యలు ఉన్నప్పుడు స్థానిక వైద్యులను సంప్రదించి, అవసరమైతే వాస్కులర్ నిపుణులను సంప్రదించాలని ఆయన పిలుపునిచ్చారు. యాంపుటేషన్ ఫ్రీ ఇండియా ప్రచారంలో భాగంగా ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యశోద హాస్పిటల్స్ మార్కెటింగ్ సిబ్బంది లక్ష్మణ్ రావు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీల అమలులో విఫలమైన కాంగ్రెస్‌పై బీజేపీ ధర్నా




**పెద్దపల్లి, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటి అమలులో విఫలమైందని, అధికారంలో ఉండే హక్కు లేదని బీజేపీ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్ గౌడ్ విమర్శించారు. జూలపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తహసీల్దార్ లేకపోవడంతో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ప్రతి మహిళకు ?2500, కల్యాణలక్ష్మిలో తులం బంగారం, ?500 గ్యాస్ సిలిండర్, పెన్షన్ రెట్టింపు, నిరుద్యోగ భృతి, విద్యార్థినులకు స్కూటీలు వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు సమయానికి రాకపోవడం అధికార యంత్రాంగంపై ప్రభుత్వానికి పట్టు లేదని ఆయన విమర్శించారు. హామీల అమలులో విఫలమైతే ప్రజల తిరుగుబాటు తప్పదని, బీజేపీ ప్రజల పక్షాన పోరాడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తీగల అశోక్, పెద్దల్ల ఐలయ్య, అందె శివ ప్రసాద్, మల్లెత్తుల అంజి, పొన్నం సంతోష్, ఆశడుపు వెంకటేష్, కొమ్మ ఐలయ్య, దొడ్ల రాజిరెడ్డి, కంచి శ్రీనివాస్, మేరుగు కనకయ్య, గడ్డం తిరుపతి రెడ్డి, అమరగాని అజయ్, సందవేణి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో అరుదైన ఇండియన్ మూన్ మోత్ దర్శనం



**అమ్రాబాద్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నల్లమల అటవీ సంపదకు మరో ప్రత్యేక గుర్తింపు లభించింది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో అరుదైన ఇండియన్ మూన్ మోత్ కనిపించినట్లు హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. ఆకుపచ్చ రెక్కలు, పొడవైన తోకలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఈ రాత్రి చిమ్మట ఆరోగ్యకరమైన అటవీ ప్రాంతాల్లో మాత్రమే కనిపిస్తుందని నిపుణులు పేర్కొన్నారు. కాళ్లలో గొంగళిపురుగు దశలో అడవి మొక్కల ఆకులను ఆహారంగా తీసుకుంటే, వయోజన దశలో కేవలం 5--8 రోజులు మాత్రమే జీవించి సంతానోత్పత్తిపైనే దృష్టి పెడుతుంది. ఇలాంటి అరుదైన జాతుల నమోదు జీవవైవిధ్య పరిరక్షణకు ఎంతో ముఖ్యమని నిపుణులు తెలిపారు. ఇండియన్ మూన్ మోత్ దర్శనం నల్లమల అడవుల పర్యావరణ ఆరోగ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. సహజ ఆవాసాలు, వృక్ష సంపదను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఇలాంటి అరుదైన జాతులను అందించవచ్చని సూచించారు. హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ కోఆర్డినేటర్ బాపురెడ్డి మాట్లాడుతూ, వన్యప్రాణులతో పాటు కీటక జాతులు కూడా పర్యావరణ సమతుల్యతలో కీలక పాత్ర పోషిస్తాయని, వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అరుదైన ఇండియన్ మూన్ మోత్ దర్శనంతో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ మరోసారి తన జీవవైవిధ్య వైభవాన్ని చాటుకుంది.

# నీట్ అక్రమాలపై ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఆగ్రహం



**అమ్రాబాద్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలు, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం దారుణమని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు అచ్చంపేట పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా జరిగింది. ఎమ్మెల్యే వంశీకృష్ణ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ అక్రమాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి ?1 కోటి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పరీక్షా వ్యవస్థ పారదర్శకంగా ఉండి యువతకు న్యాయం జరగాలని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధానాలను కేంద్రం అరికట్టాలని ఆయన స్పష్టం చేశారు.

# ఎల్పీజీ వినియోగదారులు తప్పనిసరిగా బయోమెట్రిక్ కేవైసీ పూర్తి చేయాలి

**కరీంనగర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ ఫర్ ఎల్పీజీ డిబిటిఎల్--పహల్, ప్రధాన మంత్రి ఉజ్జ్వల యోజన పథకాల పరిధిలోకి వచ్చే అన్ని గృహ వినియోగదారులు బయోమెట్రిక్ ఆధార్ అథెంటికేషన్ (బిఎఎ) తప్పనిసరిగా పూర్తి చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ తెలిపారు. ఇప్పటి వరకు బిఎఎ చేయించుకోని వినియోగదారులు జూన్ 30, 2026 లోపు సంబంధిత గ్యాస్ ఏజెన్సీ లేదా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల మొబైల్ యాప్‌ల ద్వారా ఉచితంగా కేవైసీ పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతి వినియోగదారు నిర్దిష్ట గడువులోపు బయోమెట్రిక్ ధృవీకరణ పూర్తి చేయాలని కలెక్టర్, పౌరసరఫరాల కార్యాలయం కరీంనగర్ విజ్ఞప్తి చేసింది.

# ఘనంగా శ్రీ భూలక్ష్మి మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్టాపన





**పెద్దపల్లి, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి మండలం ములసాల గ్రామంలో శ్రీ భూలక్ష్మి మహాలక్ష్మి బొడ్రాయి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్ల మనోహర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. గ్రామస్తులు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. ప్రజల ప్రేమాభిమానాలు, ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ తనకు బలమని దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మహోత్సవంలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డీసీహెచ్ఎస్ శ్రీధర్‌కు ఘన సన్మానం



**పెద్దపల్లి, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్ బదిలీ రద్దు చేసి యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైస్ చైర్మన్ కొండి సతీష్ మాట్లాడుతూ, డాక్టర్ శ్రీధర్ బదిలీ రద్దు కావడం ప్రజల విజయమని, ఆయన నాయకత్వంలో ఆసుపత్రి సేవలు, సానిటేషన్, పరిపాలన, సమయపాలన, నాణ్యతా ప్రమాణాలు మెరుగుపడ్డాయని తెలిపారు. పెద్దపెద్ద శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందారని, ఆసుపత్రికి నాలుగు ప్రతిష్ఠాత్మక అవార్డులు లభించాయని పేర్కొన్నారు. పెద్దపల్లి ఆసుపత్రిని రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిపిన ఘనత డాక్టర్ శ్రీధర్‌కే దక్కుతుందని, భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోమటిపల్లి సదానందం, తిరుమలేష్, దిలీప్, కనుకుంట్ల సదానందం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కఠిన చర్యలు

**- కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పెద్దపల్లి, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వ భూముల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, ఆక్రమణలు, అక్రమ పట్టాలు, భూ అక్రమాలపై కఠిన చర్యలు కొనసాగిస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ముత్తారం మండలంలోని పోతారం, మైదంబండ గ్రామాల్లో జరిగిన విచారణలో ప్రభుత్వ భూములపై అక్రమంగా సృష్టించబడిన పట్టాలను రద్దు చేసి, భూములను తిరిగి ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న మిషన్ భగీరథ మంథని సబ్ డివిజన్ హెల్పర్ గుజ్జుల శ్రీధర్, ఎంపీడీవో కార్యాలయ డేటా ఎంట్రీ ఆపరేటర్ పాదాల సతీష్, నరేగా ఫీల్డ్ అసిస్టెంట్ ధూమల శ్రవణ్‌తో పాటు ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని ఆయన స్పష్టం చేశారు.

# ఎల్లమ్మ పట్నాలకు ప్రభుత్వ విప్ హాజరు

**ఎలిగేడు, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని లాలపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ పట్నాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరై ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. విజయరమణారావుతో పాటు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ ఏలేటి వెంకటరెడ్డి, పెద్ది కుమార్, గౌడ సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రైతులను ఇబ్బంది పెడుతున్న యూరియా యాప్ రద్దు చేయాలి



**మర్రిగూడ, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం మర్రిగూడ మండల తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. సాంకేతిక పరిజ్ఞానం లేక నిరక్షరాస్యులైన రైతులు యాప్ వాడకంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి ఎర్పుల యాదయ్య పేర్కొన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న యూరియా కోసం యాప్ వల్ల ఇబ్బంది పడటం దురదృష్టకరమని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పాత పద్ధతిలోనే యూరియా పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొట్టం యాదయ్య, సల్వోజు రామలింగాచారి, రైతులు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం



కాలి బూడిదైనా పూరి గుడిసా

**ఎలిగేడు, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని ముప్పిరితోట గ్రామంలో బుధవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి కనుకుంట హనుమమ్మకు చెందిన పూరి గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో



ఆవేదన చెందుతున్న బాధితురాలు

గుడిసెలో ఉన్న బట్టలు, బియ్యం, గృహోపకరణాలు మాత్రమే కాకుండా, రెండో విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం కోసం తెచ్చుకున్న రూ. 2 లక్షల నగదు కూడా మంటల్లో కాలిపోయింది. గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. కూలి పనికి వెళ్లిన హనుమమ్మకు గ్రామస్తులు సమాచారం అందించగా, ఆమె సంఘటన స్థలానికి చేరుకొని తన గుడిసె కాలిపోవడం చూసి బోరున విలపించింది. ఈ ప్రమాదంతో బాధిత కుటుంబం నిలువ నీడ లేకుండా రోడ్డుపై పడింది. గ్రామస్తులు ప్రభుత్వం, అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి సహాయం అందించాలని కోరుతున్నారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

# కనుల పండుగలా సాగిన వెంకటేశ్వర స్వామి కళ్యాణం

**వినోబా నగర్, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రీ భూదేవి, శ్రీదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాల రెండో రోజు కార్యక్రమాలు ఈరోజు బుధవారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మూలమంత్ర హవనం, గణపతి, దుర్గా, నవగ్రహ హవనాలు నిర్వహించగా, అనంతరం నిత్య పూర్ణాహుతి, బలిహరణ కార్యక్రమాలు జరిగాయి. వేదపండితుల ఆధ్వర్యంలో



జరిగిన శ్రీనివాస స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం కనుల విందుగా సాగి భక్తులను మంత్రముగ్ధులను చేసింది. భక్తులు, దేవస్థాన పాలక మండలి, జీవితకాల సభ్యులు, భగవద్ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు, అన్నదాన ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, 108 స్వర్ణపుష్పార్చన, కుంకుమార్చన, మూలమంత్ర హవనం, రుద్ర హవనం, అలాగే స్వామివారి ఊరేగింపు శాస్త్రోపయుక్తంగా నిర్వహించారు. అనంతరం నిత్య పూర్ణాహుతి, బలిహరణం చేసి భక్తులకు ప్రసాదం అందజేశారు. బ్రహ్మోత్సవాల చివరి రోజైన గురువారం మహా పూర్ణాహుతి, చక్రస్నానం నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ తెలిపింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భగవంతుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

# పట్టణ ప్రజలు నీరు వృధా చేయకూడదు

## -- మున్సిపల్ చైర్మన్



నీలగిరి ఎక్స్‌ప్రెస్

epaper.neelagiriexpress.in | Date: 24 Jun, 2026 | Page: 4

**9వ వార్డులో డ్రైనేజ్ సమస్యలపై వినతి**

**పెద్దపల్లి, జూన్ 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి పట్టణంలోని తొమ్మిదో వార్డులో డ్రైనేజ్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. వర్షాకాలంలో డ్రైనేజీలు లేకపోవడం, ఉన్న డ్రైనేజీలు సరిగా పనిచేయకపోవడం వల్ల వర్షపు నీరు రోడ్లపై, ఇళ్లలోకి చేరి నిలిచిపోతుందని వారు తెలిపారు. నీటి నిల్వ కారణంగా దోమలు, కీటకాలు పెరిగి ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న డ్రైనేజీలను వెంటనే శుభ్రం చేయడంతో పాటు, డ్రైనేజీలు లేని చోట కొత్త నిర్మాణాలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ జుబేర్, ఎండి అక్తర్, సయ్యద్ ఫర్హాన్ కోరారు.

epaper.neelagiriexpress.in | 24 Jun, 2026 | Page: 4 | Clip ID: C-226759
For more details, visit epaper.neelagiriexpress.in | Demo Only




**పెద్దపల్లి, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ విప్ & ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు నెల రోజులపాటు సానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 9వ వార్డులో పనులను మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు నల్ల నీరు వృధా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నీరు సరిపడిన వెంటనే నల్లను మూసివేయాలని సూచించారు. చెత్తను మురికికాలువల్లో వేయరాదని హెచ్చరించారు. పట్టణంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు చాలావరకు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నాదీమ్, ఫర్హానాజ్, సల్మాన్ ఖాన్, వార్డు ఆఫీసర్ సంజీవ్, సానిటరీ ఇన్స్పెక్టర్ రామ్మోహన్ రెడ్డి, సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు

# క్షణికానందం- కోలుకోలేని దెబ్బ

**-నందికొట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన**




**నందికొట్కూరు,జూన్ 24(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నేటి యువత క్షణికానందానికి బానిసలైతే జీవితంలో కోలుకోలేని దెబ్బ తగులుతుందని నందికొట్కూరు టౌన్ సీఐ అశోక్ కుమార్ హెచ్చరించారు.

భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు బుధవారం నందికొట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వద్ద నుండి పటేల్ సెంటర్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించిన అనంతరం, సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ -- "నేటి యువతే రేపటి దేశ భవిష్యత్తు. మాదకద్రవ్యాల బారిన పడితే శారీరక, మానసిక ఆరోగ్యాలు క్షీణించడమే కాకుండా కుటుంబాలు రోడ్డున పడతాయి. కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి తప్ప చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి" అని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్య రహిత జీవితం గడపాలని, సమాజంలో డ్రగ్స్ నిర్మూలనకు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఎవరైనా మాదకద్రవ్యాలు విక్రయించినా లేదా రవాణా చేసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# చదువుతోనే సమాజంలో గుర్తింపు

## - సర్పంచ్ జంగమ్మ వెంకటయ్య



**ఆమనగల్లు, జూన్ 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం, ఉన్నత స్థానం లభిస్తాయని సర్పంచ్ జంగమ్మ వెంకటయ్య అన్నారు. మండల పరిధిలోని శేట్టిపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జంగమ్మ వెంకటయ్య మాట్లాడుతూ.. చిన్నారుల్లో విద్య పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుండే ఒక సమున్నత లక్ష్యం నిర్దేశించుకుని ముందుకు సాగితే విజయం తమ సొంతమవుతుందన్నారు. చదువుతోనే ఉత్తమ భవిష్యత్ సాధ్యమని, విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నతాధికారులుగా స్థిరపడాలని సూచించారు. వార్డు సభ్యులు యాదయ్య, రాములు, ప్రధానోపాధ్యాయుడు మహేందర్ రెడ్డి మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# దాతల సహకారంతో కోదండ రామాలయం దుకాణ సముదాయాలు

**ఆలయ అభివృద్ధికి సర్పంచ్ కప్పల ప్రవీణ్ కృషి**



కోదండ రామాలయ పై కప్పుకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న సర్పంచ్ కప్పల ప్రవీణ్ తదితరులు

**ఎలిగేడు, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండల కేంద్రంలోని కోదండ రామాలయం ఆవరణలో నిర్మిస్తున్న దుకాణ సముదాయాలను త్వరితగతిన పూర్తి చేసి ఆలయానికి అప్పగిస్తామని గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ తెలిపారు. బుధవారం



పూర్తి అయిన పైకప్పు

ఆలయ ఆవరణలో దుకాణ సముదాయాల రూములపై కాంక్రీట్ స్లాబ్ వేసే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, "ఆలయ అభివృద్ధికి, పూజాధి కార్యక్రమాలకు లోటు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో గ్రామ పెద్దల దాతల సహకారంతో ఈ నిర్మాణ పనులు చేపట్టాం" అని పేర్కొన్నారు. దుకాణ సముదాయాల నిర్మాణానికి సహకరించిన గ్రామ పెద్దలకు, ఆదాయాన్ని అందిస్తున్న దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ తాటిపల్లి రమేష్ బాబు, మాజీ ఎంపీటీసీ బూర్ల సత్యనారాయణ, చింతకుంట మనోహర్ రావు, ముంజం మల్లయ్య, సుమన్, వినోద్, శ్రీకాంత్, సతీష్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డును పరిశీలించిన ఎంపీడీవో, సర్పంచ్

**వర్షపు నీరు నిల్వ కాకుండా చర్యలు**



**ఎలిగేడు, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని రాములపల్లి గ్రామ గంగిరెద్దుల కాలనీలో వర్షానికి రోడ్డుపై నీరు నిలిచి బురదమయంగా మారడంతో విషయం తెలుసుకున్న ఎంపీడీవో భాస్కర్ రావు, స్థానిక సర్పంచ్ సిద్ది తిరుపతియాదవ్ బుధవారం సందర్శించి పరిశీలించారు. గ్రామంలో ఎక్కడా వర్షపు నీరు నిలువకుండా చూసుకోవాలని, అవసరమైన చోట మొరం (మట్టి) పోయాలని ఎంపీడీవో సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు. ఈ పరిశీలనలో కాలనీవాసులు కూడా పాల్గొన్నారు.

# దేవరకొండ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గా సురేష్



**దేవరకొండ జూన్ 24.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
యూత్ కాంగ్రెస్ దేవరకొండ మండల మాజీ అధ్యక్షులు ముకురోజు రాజు ఆధ్వర్యంలో దేవరకొండ కాంగ్రెస్ పార్టీ నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మారుపాకుల సురేష్ గౌడ్ కి శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు మూడవత్ సాగర్ నాయక్, పులిజాల వెంకటయ్య,దుబ్బ చరణ్, కొర్ర మహేందేర్, రేగటి వంశీ, జెల్లల విష్ణు,జరుపుల రతన్, పిరాటి సైదులు గౌడ్, గొడుగు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# గోలగుండం ప్రాథమిక పాఠశాలలో వంటగది ప్రారంభం

**-దాతల సహకారంతో ఫర్నిచర్ బహుకరణ**



**తెల్కపల్లి, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెల్కపల్లి మండలంలోని గోలగుండం ప్రాథమిక పాఠశాలలో గ్రామపంచాయతీ నిధులతో నిర్మించిన వంటగదిని ఈరోజు సర్పంచ్ మాధవరం గోవర్ధన్ రావు, ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి కలిసి ప్రారంభించారు.అలాగే సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామంలోని దాతల సహకారంతో విద్యార్థులకు కావలసిన బెంచీలను రూ.40 వేల విలువతో పాఠశాలకు బహుకరించారు. ఈ సహకారంలో రాజల్ రావు, అశ్విని రావు, మాధవరం సంపత్ రావు, రవీందర్ రావు, సూర్నేని నవీన్ రావు, విజయ డైరీ పాల ఉత్పత్తిదారులు ముందుకు వచ్చారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, గ్రామ పెద్దలు, సర్పంచ్ అందిస్తున్న సహకారం పాఠశాల అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తోందని కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ మాట్లాడుతూ, “పాఠశాలకు కావలసిన అన్ని మౌలిక వసతులు కల్పిస్తాం” అని హామీ ఇచ్చారు.ప్రధానోపాధ్యాయురాలు కల్పన గ్రామ పెద్దలకు, సర్పంచ్‌కు ధన్యవాదాలు తెలుపుతూ, ఇంకా ప్రైవేట్ పాఠశాలలకు వెళుతున్న 15 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్చేందుకు గ్రామస్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ, ఉపాధ్యాయులు కల్పన, జ్యోతి, గ్రామ పెద్దలు, సర్పంచ్, దాతలు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం విజయవంతం చేయాలి



**దేవరకొండ జూన్ 24. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మల్లేపల్లి మండల తాహాసిల్దార్ మన్నే నరేందర్ కోరారు. కొండమల్లేపల్లి మండల పరిధిలోని బి ఎల్ ఎ మరియు బిఎల్ఓ లకు స్థానిక రైతు వేదిక కార్యాలయంలో సర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వచ్చే నెలలో నిర్వహించబోయే సర్ కార్యక్రమాన్ని ఏ విధంగా చేపట్టాలో బి ఎల్ ఏ మరియు బిఎల్ఓ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి మండల తహసిల్దార్ మన్నె నరేందర్ , ఎలక్షన్ డిటి ప్రశాంత్, ఆర్ ఐ శ్రీనివాస్, ఆంజనేయులు, మాస్టర్ ట్రైనర్లు కట్టెబోయినశ్రీనివాసులు, బి ఎల్ ఎ మరియు బిఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# నింగిలోకి 10 లక్షల ఏఐ ఉపగ్రహాలు

**న్యూఢిల్లీ జూన్ 24. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
ఉపగ్రహ రంగంలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సంచలనానికి తెరతీయనున్నారు. ఏఐ ఉపగ్రహాల సముదాయాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టనున్నట్టు ఆయన తెలిపారు. తమ సంస్థ స్పేస్ ఎక్స్ ప్రతిపాదించిన ఏఐ ఉపగ్రహాల సముదాయానికి స్టార్‌మైండ్ అని పేరు పెట్టనున్నట్టు మస్క్ ధ్రువీకరించారు. ఏఐ ఆధారిత కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను కక్ష్యలో ప్రవేశపెట్టడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ నెట్‌వర్క్‌లో 10 లక్షల వరకు ఉపగ్రహాలు ఉండచ్చునని నివేదికలు సూచిస్తున్నాయి. స్పేస్ ఎక్స్‌కు స్టార్‌లింక్ శాటిలైట్ నెట్‌వర్క్‌కు, స్టార్‌మైండ్‌కు చాలా తేడా ఉంది. రెండు ప్రాజెక్టులు కూడా అంతరిక్షంలో ఉన్న ఉపగ్రహాల మీదే ఆధారపడినప్పటికీ రెండింటి లక్ష్యం ఒకటి కాదు. ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నెట్ అనుసంధానతను కల్పించడానికి స్టార్‌లింక్‌ను ఏర్పాటు చేశారు.

# ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి



ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిని డాక్టర్ నిస్సి క్రిష్టిన



పాల్గొన్న సంబంధిత ఉద్యోగులు

**- మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా**

**--ఎలిగేడు ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయి సమావేశం**

**ఎలిగేడు, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా సూచించారు.బుధవారం ఎలిగేడు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండలస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఈ నెల 28న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రతి పంచాయతీ నుండి టామ్‌టామ్ ద్వారా విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. మండలంలో 13 పోలియో బూత్‌లలో చుక్కలు వేయడం జరుగుతుందని, 29, 30 తేదీలలో ఇంటింటి సర్వే ద్వారా పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. మండలంలో 0--5 ఏళ్లలోపు 1185 మంది పిల్లలు ఉన్నారని వివరించారు.జూలై 1న జాతీయ నులిపురుగు దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 1--19 ఏళ్ల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలంలో 31,985 మంది పిల్లలు ఉన్నారని వివరించారు.వర్షాకాలంలో వ్యాధులు విస్తరించకుండా డ్రై డే ఆక్టివిటీలు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీరు నిల్వ లేకుండా చూసుకోవడం, దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. 14 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరూ టీవీ స్కానింగ్ చేయించుకోవాలని, వైరల్ హెపటైటిస్ చేతుల అపరిశుభ్రత, ఆరుబయట మల విసర్జన, కలుషిత నీటి ద్వారా వస్తుందని ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.ఈ సమావేశంలో తహసీల్దార్ యాకయ్య, ఎంపీడీవో భాస్కరరావు, హెల్త్ సూపర్వైజర్లు లక్ష్మణ్, నాగమణి, గ్రామపంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పల్గు తండా ప్రాథమిక పాఠశాలను సందర్శించిన విద్యా కమిషన్ సభ్యులు

**విద్యార్థుల సామర్థ్యాలపై సంతృప్తి వ్యక్తం చేసిన చారకొండ వెంకటేష్**



**వెల్దండ, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని పల్గు తండా ప్రాథమిక పాఠశాలను బుధవారం తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన పాఠశాల పరిసరాలను, విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందిస్తూ, పాఠశాలలో జరుగుతున్న విద్యా కార్యక్రమాలను ప్రశంసించారు.అదేవిధంగా ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న వివిధ సౌకర్యాలు, సంక్షేమ పథకాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. ప్రతి తల్లి--తండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి, నాణ్యమైన విద్య అందించేందుకు సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎస్. చంద్రుడు, గ్రామ సర్పంచ్ ఎస్. రమేష్ నాయక్, ఉపసర్పంచ్ ఆర్. అనిత పంతు నాయక్, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు మోతిలాల్ నాయక్, ప్రధానోపాధ్యాయులు కె. పంతు నాయక్, గ్రామపంచాయతీ కార్యదర్శి గోపి, సి.ఆర్.పి అంజ్య, అంగన్వాడీ టీచర్, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# యువత మాదకద్రవ్య రహిత జీవితం గడపాలి

**నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం పిలుపు**



**నందికొట్కూరు, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నేటి పిల్లలు రేపటి పౌరులు, యువత మాదకద్రవ్య రహిత జీవితం గడిపితేనే భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చునని రూరల్ సీఐ టి. సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.బుధవారం “నషా ముక్త్ భారత్ అభియాన్” కార్యక్రమంలో భాగంగా బ్రాహ్మణకోట్కూరు జడ్పీహెచ్ హై స్కూల్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ -- “మాదకద్రవ్యాల వినియోగం ప్రాణానికి హాని. నిండు నూరేళ్ల జీవితం మధ్యలోనే రాలిపోతుంది. కాబట్టి మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా గురువుల, తల్లిదండ్రుల బోధనలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి” అని సూచించారు.మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించి, ఆరోగ్యకరమైన జీవితం గడపాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం “మాదకద్రవ్యాలు మరియు విద్యార్థులపై వాటి ప్రభావం” అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో 1వ, 2వ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, బ్రాహ్మణకోట్కూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఐసీడీఎస్ సూపర్వైజర్‌ను సన్మానించిన సర్పంచ్



**ఎలిగేడు, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల ఐసీడీఎస్ సూపర్వైజర్ అనిత బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా గ్రామపంచాయతీకి వచ్చిన సందర్భంగా, సర్పంచ్ కప్పల ప్రవీణ్ శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, “ఐసీడీఎస్ ద్వారా అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు, బాలింతలకు, గర్భిణీలకు అందిస్తున్న సేవలు అమూల్యమైనవి. మీ సేవలకు ఎల్లప్పుడూ మా సహకారం ఉంటుంది” అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముంజం నరేశ్, పంచాయతీ కార్యదర్శి అంజలి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి

**-ఎలిగేడు సర్పంచ్ కప్పల ప్రవీణ్ పిలుపు**



మోదుగా ఆకు విస్తార్లు తయారు చేస్తున్న మహిళలు

**ఎలిగేడు, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ కప్పల ప్రవీణ్ పిలుపునిచ్చారు.బుధవారం ఎలిగేడు గ్రామంలో పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ, ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, కవర్ల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ప్రకృతి సిద్ధమైన మోదుగు విస్తారాకులను ఉపయోగించాలని ప్రోత్సహిస్తూ, కూలీలకు వాటిని పంపిణీ చేశారు.గ్రామపంచాయతీ ప్రత్యేక చొరవగా ఇకపై గ్రామంలో జరిగే ఏ చిన్న ఫంక్షన్‌కైనా స్టీల్ ప్లేట్లను అందుబాటులో ఉంచనున్నట్లు సర్పంచ్ ప్రకటించారు. ఇంటి వద్ద జరిగే వేడుకలకు ప్లేట్లను తీసుకెళ్లి, కార్యక్రమం పూర్తయిన వెంటనే తిరిగి గ్రామపంచాయతీకి అప్పగించాలని సూచించారు. దీని ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను భారీగా తగ్గించవచ్చునని ఆయన అన్నారు.అంతేకాకుండా తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ చెత్తను వేరువేరుగా చేసి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు అందించాలని గ్రామస్తులను కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంజలి, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

- ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అచ్చంపేట, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అచ్చంపేట పట్టణ కేంద్రంలో టీపీసీసీ మరియు నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా, నిరసన కార్యక్రమం జరిగింది.నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలు, విద్యార్థులు మరియు యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐసీసీ ఆదేశాలు, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు ఈ నిరసన చేపట్టారు.ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ -- "నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధానాలను కేంద్ర ప్రభుత్వం అరికట్టాలి. యువతకు న్యాయం జరిగేలా పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను అమలు చేయాలి" అని డిమాండ్ చేశారు.అలాగే, విద్యార్థులు--యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాటం చేస్తుందని, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర ప్రారంభం..

- భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి

- - ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



**ఆమనగల్లు, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రిజర్వేషన్ హక్కులు పొందిన లంబాడి, ఎరుకల, యానాది తెగలు 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న రిజర్వేషన్ స్వర్ణోత్సవాల్లో భాగంగా నేడు (గురువారం) ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర ప్రారంభం కానుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని గాంధీభవన్ వద్ద తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బస్సు యాత్రను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. యాత్రలో భాగంగా మధ్యాహ్నం 12:30 గంటలకు కడ్తాల మండలం మైసిగండి క్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభకు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. రిజర్వేషన్ స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అలాగే లంబాడి, ఎరుకల, యానాది గిరిజన సోదరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు.

## నూతన పట్టు వస్త్ర అలంకరణలో టిపిసిసి ఎస్సి డిపార్ట్మెంట్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ

-డాక్టర్ యేకుల రాజారావు.



**దేవరకొండ జూన్ 24. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ నియోజకవర్గం గుండ్లపల్లి మండలం నిజాంనగర్ గ్రామానికి చెందిన స్వాతి -నరసింహ దంపతుల కుమార్తె అక్షయ, ప్రవళిక, మరియు కుమారుడు వరుణ్ కుమార్ ల నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుక నిజాం నగర్ వారి స్వగృహంలో జరిగిన కార్యక్రమానికి హాజరై మెమొంటోను అందజేసి చిన్నారులను ఆశీర్వదించిన టిపిసిసి ఎస్సి డిపార్ట్మెంట్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ యేకుల రాజారావు .ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. అక్షయ, ప్రవళిక,, మరియు వరుణ్ కుమార్ ఉన్నత విద్యను అభ్యసించి, సంస్కారంతో , జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బోయిని చంద్రమౌళి, , మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గం నాయకులు,సురేష్,బాలకృష్ణ, దామోదర్, చెన్నయ్య,, ఎర్ర వెంకటయ్య, మాల మహానాడు సోషల్ మీడియా కోఆర్డినేటర్ చేపూరి మురళి, , స్థానిక ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, తదితరులు పాల్గొన్నారు .

## ఎస్ఐఆర్‌పై జిల్లా టిడిపి శ్రేణులకు దిశానిర్దేశం

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య సూచనలు






**నందికొట్కూరు, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అధ్యక్షతన జరిగిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో అర్హులైన ఓటర్లందరినీ చేర్పించాలి. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి. డూప్లికేట్, మరణించిన ఓటర్లను జాబితా నుంచి తొలగించాలి" అని సూచించారు.ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించాలని, క్లస్టర్, యూనిట్, బూత్ పరిధిలో కార్యక్రమాన్ని తప్పక పూర్తి చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బీఎల్ఏలతో సమన్వయం చేసుకుని పారదర్శకంగా పనిచేయాలని, బలమైన బూత్ కమిటీలే పార్టీకి పునాదులని, ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడటం ప్రతి కార్యకర్త బాధ్యత అని స్పష్టం చేశారు.అలాగే, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నేతలకు సూచించారు.ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత

-500 మంది పోలీసులతో బందోబస్తు -- ఎస్పీ సునీల్ షోరాణ్





**కర్నూలు, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 25న విచ్చేయనున్న నేపథ్యంలో, పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ పరిశీలించారు.సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, ఇతర కీలక ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఆయన సమీక్షించారు.
ముఖ్యమంత్రి పర్యటన భద్రతా ఏర్పాట్లలో భాగంగా 500 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని విధుల్లో నియమించినట్లు ఎస్పీ తెలిపారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని, విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చూడాలని ఎస్పీ దిశానిర్దేశం చేశారు.బందోబస్తు నిమిత్తం వచ్చిన పోలీసు అధికారులకు, సిబ్బందికి భద్రతా విధులపై ప్రత్యేక సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో నంద్యాల స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, కర్నూలు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఉపేంద్ర బాబు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## దేవుడు నాయక్ మృతి తీరని లోటు

- గోలి శ్రీనివాస్ రెడ్డి



**ఆమనగల్లు, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన గ్రామ పెద్ద బాణావత్ దేవుడు నాయక్ మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. దేవుడు నాయక్ మరణ వార్త బాధాకరమని, ఆయన మరణం కుటుంబ సభ్యులతో పాటు గ్రామ ప్రజలకు తీరని లోటని అన్నారు. మంగళవారం నారాయణపూర్ గ్రామానికి చేరుకున్న గోలి శ్రీనివాస్ రెడ్డి దేవుడు నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవుడు నాయక్ గ్రామ పెద్దగా ప్రజల మన్ననలు పొందారని, గ్రామాభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన లేని లోటు గ్రామ ప్రజలకు ఎప్పటికీ కనిపిస్తూనే ఉంటుందని అన్నారు. దేవుడు నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.

## పదవీ విరమణ పొందిన ప్రమీలకు ఘన సన్మానం

- సేవలను కొనియాడి శుభాకాంక్షలు తెలిపిన వార్డు సభ్యురాలు రాణి




**ఆమనగల్లు, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అంగన్వాడీ టీచర్ చల్లా ప్రమీల పదవీ విరమణ పొందిన సందర్భంగా చల్లంపల్లి గ్రామంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1వ వార్డు సభ్యురాలు పోతుగంటి రాణి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అంగన్వాడీ శాఖలో ఆమె ఎన్నో సంవత్సరాల పాటు నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంక్షేమానికి విశేష కృషి చేశారని కొనియాడారు. చల్లా ప్రమీల సేవలు గ్రామ ప్రజల మన్ననలు పొందాయని, ఆమె అంకితభావం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, సమాజ సేవకు కాదని, భవిష్యత్‌లో కూడా ఆమె ప్రజలకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సుజాత, గాజుల ప్రీతి, పోతుగంటి శిరీష, కళ్యాణి తదితరులు ఉన్నారు.

## ఎస్పిఆర్, అరవిందో పాఠశాలల బుక్స్ స్టాల్ సీజ్

**కల్వకుర్తి, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ఇతర విద్యా సామగ్రిని విద్యార్థులకు బలవంతంగా విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలైన పిడిఎస్యు, ఏఐఎస్ఎఫ్, యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది.విద్యాశాఖ జారీ చేసిన జీవో నెం.1 ప్రకారం ఏ పాఠశాల కూడా తమ ప్రాంగణంలో పుస్తకాలు, యూనిఫాంలు లేదా ఇతర విద్యా సామగ్రిని విక్రయించరాదని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, అరవింద్ అండర్ ఎస్పిఆర్ పాఠశాలలో ప్రత్యేకంగా పుస్తకాల గదిని ఏర్పాటు చేసి విక్రయాలు నిర్వహిస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి.ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పాఠశాలలోని బుక్స్ స్టాల్‌ను సీజ్ చేశారు.అయితే, ఇంత పెద్ద విద్యాసంస్థలో శాశ్వత ప్రిన్సిపాల్ లేకుండా నామమాత్రంగా నిర్వహించడం పట్ల కూడా విద్యార్థి






సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, పరిపాలనా వ్యవస్థ, తల్లిదండ్రుల సమస్యల పరిష్కారం కోసం వెంటనే అర్హత కలిగిన ప్రిన్సిపాల్‌ను నియమించాలని డిమాండ్ చేశారు.పాఠశాలలో జరుగుతున్న అన్ని అక్రమ వసూళ్లు, పుస్తకాల విక్రయాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లిమండల విద్యాధికారి (ఎంఈఓ)లిని కోరారు.ప్రభుత్వం విద్యను వ్యాపారంగా మార్చే ప్రైవేట్ విద్యాసంస్థలపై కఠిన నిఘా పెట్టాలని, విద్యార్థులు--తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపే చర్యలను అరికట్టాలని వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్, పిడిఎస్యు సంతోష్, యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సయ్యద్, పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్, కల్వకుర్తి నియోజకవర్గ కార్యదర్శి సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పాకిస్థాన్ గగనక్షేత్రంలోకి ప్రవేశించిన ఎయిర్ ఇండియా విమానం



**న్యూఢిల్లీ: జూన్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎయిర్ ఇండియాకు చెందిన ఏఐ-321 ఢిల్లీ- అమృత్‌సర్ విమానం.. పాకిస్థాన్ వైమానిక క్షేత్రంలోకి ప్రవేశించింది. దీంతో కొంత ఉద్రిక్త క్షణాలు నెలకొన్నాయి. అయితే పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన తర్వాత రెండు దేశాల మధ్య సరైన సంబంధాలు లేని విషయం తెలిసిందే. సోమవారం రాత్రి ఎయిర్ ఇండియాకు చెందిన విమానం కొన్ని సెకన్ల పాటు పాక్ గగనతలంలోకి ప్రవేశించినట్లు తెలిసింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపడుతున్నట్లు ఎయిర్ ఇండియా చెప్పింది. పాక్ వైమానిక క్షేత్రంలోకి ప్రవేశించిన విషయాన్ని పైలట్ గుర్తించాడని, పాకిస్థాన్ ఎయిర్ ట్రాఫిక్ అథారిటీ నుంచి పైలట్‌కు వార్నింగ్ మెసేజ్‌లు వచ్చినట్లు తెలిసింది.సోమవారం రాత్రి 9.18 నిమిషాలకు ఢిల్లీ నుంచి ఆ విమానం టేకాఫ్ తీసుకున్నది. అయితే అమృత్‌సర్‌లో 10.30 నిమిషాలకు ఆ విమానం ల్యాండ్ కావాలి. కానీ అనుకోకుండా ఆ విమానం పాక్ ఎయిర్‌స్పేస్‌లోకి ఎంటరైంది. ఆ సమయంలో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు శ్రీ గురు రామ్ దాస్ జీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు మేనేజింగ్ అధికారి తెలిపారు. స్థానిక ఎయిర్ పోర్టు కంట్రోల్ రూమ్ ఆదేశాలతో ఆ విమానం ఢిల్లీకి తిరిగి వచ్చేసింది. మళ్లీ రెండు గంటల వ్యవధి తర్వాత టేకాఫ్ తీసుకుని ఆ రోజు రాత్రి 2.20 నిమిషాలకు అమృత్‌సర్ చేరుకున్నది. పాకిస్థాన్ ఎయిర్‌స్పేస్‌లో కనీసం రెండు కిలోమీటర్ల దూరం కూడా ఆ విమానం వెళ్లలేదని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ భూపేందర్ సింగ్ తెలిపారు.

## అరుణాచల్ ప్రదేశ్‌లో విరిగిపడ్డ కొండచరియలు



**హైదరాబాద్ జూన్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అరుణాచల్ ప్రదేశ్‌లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు బుధవారం నాటికి తీవ్ర రూపం దాల్చాయి. కేయీ పన్యోర్ జిల్లాలో వరద ఉధృతికి ఇళ్లు దెబ్బతినడమే కాకుండా, ముగ్గురు వ్యక్తులు గల్లంతయ్యారు. యాజాలి పరిధిలోని పూసా సమీపంలో గల నీప్కో ప్రాజెక్ట్ కాలనీ వద్ద నిర్మాణంలో ఉన్న ఒక రిటైనింగ్ వాల్ కుప్పకూలడంతో వరద నీరు నివాస ప్రాంతాల్లోకి దూసుకెళ్లింది. కనీసం 18 ఇళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలను ముమ్మరం చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలను రంగంలోకి దింపింది.

## ప్రైవేట్ మెడికల్ కాలేజీల ఫీజులు తగ్గించలేం..

**భరించలేకపోతే స్కాలర్‌షిప్ పొందాలి: సుప్రీంకోర్టు**



**న్యూఢిల్లీ, జూన్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రైవేట్ వైద్య కళాశాలలు వసూలు చేస్తున్న అధిక ఫీజులను ఈడబ్ల్యూఎస్ అర్హత కోసం నిర్ణయించిన రూ.8 లక్షల వార్షిక ఆదాయ పరిమితిని ఎలా సమన్వయం చేసుకోవచ్చని ప్రశ్నిస్తూ ఆర్థికంగా బలహీన వర్గాలకు(ఈడబ్ల్యూస్) చెందిన ఒక అభ్యర్థి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. రాష్ట్ర రెగ్యులేటరీ కమిటీ ఖరారుచేసిన ఫీజుల విధానం చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతుందని గుర్తిస్తూ రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చితో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం సమర్థించింది.ప్రభుత్వ కళాశాలలతో సమానంగా ప్రైవేట్ కళాశాలల్లో ఫీజులు ఉంటాయని ఆశించరాదని విచారణ సందర్భంగా జస్టిస్ నాగరత్న అన్నారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను ప్రస్తావిస్తూ క్యాపిటేషన్ ఫీజు రద్దయింది కాబట్టి సాధారణ కాలేజీ ఫీజులు కూడా తీసుకోరాదంటే ఎలా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఒకవేళ మీరు చెల్లించలేకపోతే ఉపకారవేతనం లేదా ఆర్థిక సహాయం పొం దండి అని పిటిషనర్ సూచించారు

## మునీర్ హత్యకు మొస్సాద్ స్కెచ్

**జెనీవా:జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధాన్ని ఆపడానికి స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో శాంతి చర్చలు జరుగుతున్న క్రమంలో బ్రెజిల్ పాత్రికేయుడొకరు సంచలన విషయాన్ని వెల్లడించారు.చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్న పాక్ మిలిటరీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ అసీమ్ మునీర్ సహా మొత్తం పాక్ ప్రతినిధి బృందాన్ని హతమార్చడానికి ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ ప్రణాళిక వేసిందని బ్రెజిల్ పరిశోధక పాత్రికేయుడు, భౌగోళిక వ్యూహరచన నిపుణుడైన పెపె ఎస్కోబార్ ఆరోపించారు. మొస్సాద్ దాడి గురించి తెలిసిన పాక్ మధ్యవర్తుల ద్వారా ఇజ్రాయెల్‌కు నేరుగా హెచ్చరిక జారీ చేసిందన్నారు.

# ఆరోగ్య కార్డులు వెంటనే మంజూరు చేయాలి.

**-317 జీవో బాధితులకు న్యాయం చేయాలి..**
**-పిఆర్సి నీ వెంటనే అమలు చేయాలి**
**-టియుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ లచ్చిరాం డిమాండ్..**



**కల్వకుర్తి, జూన్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఉద్యోగ, ఉపాధ్యాయుల మే నెల వేతనం నుండి 1.5 శాతం ఈహెచ్ఎస్ చందా వసూలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మార్గదర్శకాలు రూపొందించకపోవడం శోచనీయమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల అతి ముఖ్య సమస్యలైన పిఆర్సి , డిఏ వంటి వాటిని పరిష్కరించకుండా ఎవరు అడగని హెల్త్ ఇన్సూరెన్స్ ను ముందుకు తీసుకువచ్చి సమస్యలను పక్కదారి పట్టించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. వెంటనే అన్ని కార్పోరేట్ ఆసుపత్రులలో అమలయ్యే విధంగా ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయులు అప్పులు తీసుకొచ్చి ఆసుపత్రిలో చెల్లిస్తున్నారని వాపోయారు. జూన్ 30 తేదీ నాటి విద్యార్థుల సంఖ్య ఆధారంగా సర్దుబాటు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి. ప్రాథమిక పాఠశాలల్లో 1-9 విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలని, 60 మంది విద్యార్థులకు 5 గురు ఉపాధ్యాయులు ఉండాలని, ఆపైన ప్రతి 20 మందికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలని డిమాండ్ చేశారు. ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని కోరారు. 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు వెంటనే బదిలీలు చేయాలని, మిగిలిపోయిన స్పౌజ్ బదిలీలు పూర్తి చేయాలని కోరారు. జూలై 31 తేదీ కట్ ఆఫ్ తో ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని కోరారు. రెగ్యులర్ ప్రాతిపదికన ఎంఈఓ పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ప్రత్యక్ష నియామకాల కంటే ముందే డైట్ లెక్చరర్,జీహెచ్ఎం, +తీ-1, డిప్యూటీ ఈవో పోస్టులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సంఖ్యలో అసమతుల్యత, కొత్తగా పిఈటి , పిడి ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడం తదితర కారణాల దృష్ట్యా కాంప్లెక్స్ పాఠశాలను రీఆర్గనైజ్ చేస్తూ సమావేశాలను 6 నుండి 3 కు కుదించాలని కోరారు. జూన్ 30వ తేదీ లోపు పిఆర్సి ప్రకటించాలని డిమాండ్ చేశారు.
పాఠశాలల కుదింపు ఆలోచనను విరమించుకోవాలని, సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని, పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ లచ్చిరాం, ప్రధాన కార్యదర్శి పి.రఘునందన్ రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షులు డి.మల్లారెడ్డి, ఆర్థిక కార్యదర్శి పి.మొగులయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.గోపాల్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు అధ్యక్షులు శైలం, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పి.సత్యనారాయణ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జి.దేవిడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామస్వామి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం







**యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు**
**- ఎస్ఐ కురుమూర్తి**

**కల్వకుర్తి, జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
యువత చెడు దారిని ఎంచుకోవద్దని, మాదకద్రవ్యాలు విద్యార్థుల బంగారు భవిష్యత్తును నాశనం చేస్తాయని కల్వకుర్తి ఎస్ఐ కురుమూర్తి సూచించారు. బుధవారం కల్వకుర్తి ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తూ ఆయన మాట్లాడుతూ -- "తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎన్నో ఆశలతో జీవిస్తారు. ఆ ఆశలను ఆర్యాశలు చేయకుండా క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానంలో ఎదగాలి" అని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలు సరదాల పేరుతో తీసుకోవద్దని, వాటికి బానిసలై జీవితాన్ని సర్వనాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. వ్యసనాల వల్ల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటాయని విద్యార్థులు గమనించాలని సూచించారు. మంచి స్నేహాలు చేయాలని, చెడు అలవాట్లు ఉన్నవారిపట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా మత్తు పదార్థాలు సేవించమని ఒత్తిడి తెస్తే వెంటనే కళాశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, డయల్ 100కు ఫోన్ చేయాలని ఎస్ఐ కురుమూర్తి సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఖమేనీ అంత్యక్రియలకు ప్రధాని మోదీకి ఆహ్వానం

**-ఆహ్వానించిన ఇరాన్ ప్రెసిడెంట్**





**న్యూఢిల్లీ:జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరుకావాలని భారత ప్రధాని మోదీ ని ఇరాన్ ఆహ్వానించారు. ఈ మేరకు ఆ దేశ అధ్యక్షుడు పెజెష్కియాన్ స్వయంగా లేఖ రాశారు. మరి దీనిపై కేంద్రం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. భారత్ ఇప్పటివరకు ఇరాన్-అమెరికా ఉద్రిక్తతల విషయంలో శాంతి, చర్చల ద్వారానే పరిష్కారం కావాలని తన వైఖరిని చెబుతూ వస్తోంది. ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు జూలై 4న ప్రారంభం కానున్నాయి. పలు దశల్లో జరిగే నివాళి కార్యక్రమాల అనంతరం జూలై 9న ఆయన స్వస్థలమైన మష్హాద్‌లో ఖననం చేయనున్నారు. టెహ్రాన్, ఖోమ్ నగరాల్లో కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో జరిగిన అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో 86 ఏళ్ల ఖమేనీ మరణించినట్లు ఇరాన్ ప్రకటించింది. దాదాపు 36 ఏళ్ల పాటు ఆయన ఇరాన్‌కు సుప్రీం లీడర్‌గా సేవలందించారు. అంత్యక్రియలకు కోట్ల సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉందని ఇరాన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ కార్యక్రమానికి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తరపున కూడా ప్రతినిధి బృందం హాజరుకానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఇరాన్ అధ్యక్షుడు తనను కూడా ఆహ్వానించారని షెహబాజ్ షరీఫ్ వెల్లడించారు.

# రిజర్వేషన్‌ను అంతం చేయడమే బీజేపీ రియల్ టార్గెట్



**న్యూఢిల్లీ:జూన్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
లోక్‌సభలో మూడవ వంతు మెజారిటీ కోసం బీజేపీ ప్రయత్నిస్తుందని, దాంతో రిజర్వేషన్లను అంతం చేయాలని ఆ పార్టీ చూస్తున్నట్లు కాంగ్రెస్ నేత జయరాం రమేశ్ ఆరోపించారు. మూడో వంతు మెజారిటీ రాగానే రాజ్యాంగ సవరణ చేపట్టి రిజర్వేషన్ ప్రక్రియను పూర్తిగా ఎత్తివేయాలని చూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ తొలుత మహిళా రిజర్వేషన్ బిల్లు నెపంతో డీలిమిటేషన్ బిల్లును తెచ్చిందని, దాని ముఖ్య ఉద్దేశం రిజర్వేషన్‌ను అంతం చేయడమే అవుతుందన్నారు. ఒకవేళ మహిళ రిజర్వేషన్ పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంటే, అప్పుడు నారీ శక్తి వందన్ అభియాన్ బిల్లును ప్రస్తుత లోక్‌సభ సామర్థ్యంతో అమలు చేయాలని జయరాం రమేశ్ డిమాండ్ చేశారు. టీఎంసీ, శివసేన యూబీటీ చీలకలో కేంద్ర మంత్రి అమిత్ షా జోక్యం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. బీజేపీకి 400 సీట్ల రావాలన్న కాంక్ష ఉందని, దాని కోసం రాజ్యాంగాన్ని సవరణ చేసి, రిజర్వేషన్‌ను అంతం చేయాలని చూస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నేత తెలిపారు. ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లులు పాస్ కాకపోవడం వల్లే పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. బుల్డోజ్ చేసైనా డీలిమిటేషన్ బిల్లును ఆమోదించాలని మంత్రి షా ప్రయత్నించారని, కానీ ఆయన విఫలమైనట్లు రమేశ్ తెలిపారు. ఆ రోజు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలని షా విభిన్న రాజనీతికి పాల్పడుతున్నట్లు తెలిపారు. లోక్‌సభలో మూడో వంతు మెజారిటీ కోసం టీఎంసీ, శివసేనలో చీలిక తెచ్చారన్నారు.